మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 28-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు:8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 91 Issue: 91

28 సెప్టెంబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:04 తిథి విదియ రా. 7:11 వరకు తరువాత తదియ సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం రేవతి ఉ. 10:16 వరకు తరువాత అశ్విని యోగం ధ్రువ ఉ. 8:48 వరకు కరణం తైతుల ఉ. 8:08 వరకు గరజి రా. 7:11 వరకు వర్జ్యం తె. 5:15 నుండి ఉ. 6:46 వరకు దుర్ముహూర్తం మ. 12:30 నుండి మ. 1:18 వరకు మ. 2:53 నుండి మ. 3:41 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:08 వరకు యమగండం ఉ. 10:37 నుండి మ. 12:06 వరకు గుళికాకాలం మ. 1:36 నుండి మ. 3:05 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు ఉ. 7:57 నుండి ఉ. 9:29 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:30 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


# నేతన్నల బకాయిలేవి?



## పెంచిన రైతుబంధు ఏది?

### రేవంత్‌కు కేటీఆర్ లేఖ.. ప్రశ్నల వర్షం

**కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్ల తర్వాత తొలిసారిగా సిరిసిల్ల నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలతో స్వాగతం పలికారు. కేవలం రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు పరిమితం కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘమైన బహిరంగ లేఖను విడుదల చేశారు.**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం నిరాధారమని కేటీఆర్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజక వర్గంలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. "ఆ 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? స్వాధీనం చేసుకున్న 2,400 ఎకరా లు ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఆ వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రుజువు తరువాయి 2 వ పేజీలో...



## బ్యాంక్ ఉద్యోగుల 3 రోజుల సమ్మె వాయిదా

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు నిర్వహించాల్సిన మూడు రోజుల బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా పడింది. ఈ మేరకు వాయిదా వేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించింది. ఆదివారం రాత్రి 9.30 గంటలకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్, యూఎఫ్‌బీయూ ప్రతినిధుల మధ్య కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్యాంక్ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లతో పాటు పలు అంశాలపై చర్చించారు. ఈ చర్చల అనంతరం సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు చేపట్టాల్సిన దేశవ్యాప్త సమ్మెను వాయిదా వేస్తున్నట్లు యూఎఫ్‌బీయూ ప్రకటన జారీ చేసింది. ఇక సమ్మె వాయిదా పడటంతో సోమవారం నుంచి బ్యాంకులు యథావిధిగా పనిచేయనున్నాయి. దాంతో మూడు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఉంటుందని భావించిన ఖాతాదారులకు తాజా నిర్ణయంతో భారీ ఊరట లభించింది. జరగాల్సిన సమ్మెను వాయిదా వేసిన నేపథ్యంలో తదుపరి చర్చలు, నిర్ణయాలపై బ్యాంక్ ఉద్యోగ సంఘాల్లో ఆసక్తి నెలకొంది.

## 30 రోజుల ప్లాన్ కచ్చితం

### ప్రీపెయిడ్ మొబైల్ యూజర్లకు ట్రాయ్ శుభవార్త



**దేశవ్యాప్తంగా ఉన్న ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) భారీ ఊరట కల్పించాయి. ఇకపై టెలికాం కంపెనీలు తప్పనిసరిగా 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్‌లను అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి.**

న్యూఢిల్లీ: డేటా అవసరం లేని వారి కోసం కేవలం వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లతో కూడిన ప్లాన్‌లను కూడా అందుబాటులో ఉంచాలని నిర్దేశించాయి. ఈ మేరకు "టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (పదమూడవ సవరణ) రెగ్యులేషన్స్, 2026"ను విడుదల చేశాయి. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ప్రస్తుతం చాలా కంపెనీలు అందిస్తున్న 28 రోజుల ప్లాన్‌ల కారణంగా వినియోగదారులు ఏడాదికి 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తోంది. తాజా ఆదేశాలతో ఇకపై 30 రోజుల ప్లాన్ తప్పనిసరి కావడంతో, ఏడాదికి 12 రీఛార్జ్‌లు సరిపోతాయి. వినియోగదారులకు మరింత సౌలభ్యం కల్పించేందుకు, ప్రతి నెలా ఒకే తేదీన తరువాయి 2 వ పేజీలో...



## జెమినిలోనే ఫ్లిప్‌కార్ట్ షాపింగ్

### గూగుల్, ఫ్లిప్‌కార్ట్ మధ్య కీలక భాగస్వామ్యం

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్, ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ కలిసి భారత వినియోగదారులకు సరికొత్త షాపింగ్ అనుభవాన్ని అందించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇకపై గూగుల్ జెమిని, ఏఐ సెర్చ్ మోడ్‌లోనే నేరుగా ఫ్లిప్‌కార్ట్ వస్తువులను కొనుగోలు చేసేందుకు వీలుగా "బై" బటన్‌ను పరీక్షిస్తున్నాయి. ఈ ప్రయోగం విజయవంతమైతే, ఆన్‌లైన్ షాపింగ్ విధానంలో ఇది ఒక కీలక మార్పు కానుంది. ఈ కొత్త ఫీచర్ ద్వారా, వినియోగదారులు ఏదైనా వస్తువు కోసం తరువాయి 2 వ పేజీలో...



## 1 నుంచి ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు కాస్ట్లీ

న్యూఢిల్లీ: పండుగ సీజన్‌లో ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్, టీవీ కొనాలనుకునే వారికి ఖర్చు మరింత పెరగనుంది. రాగి, అల్యూమినియం, ఉక్కు, ప్లాస్టిక్ వంటి ముడిసరుకుల ధరలు పెరగడం, రవాణా ఖర్చులు అధికం కావడం, కరెన్సీ ఒడిదుడుకులు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,268 |
| వెండి (కిలో): | రూ.2,,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,390 |



## అక్టోబర్ 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుమల, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు విడుదల చేశారు. ఇటీవలే టీటీడీ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దసరా బ్రహ్మోత్సవాలకు సన్నద్ధమవుతోంది. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడేళ్లకోసారి వచ్చే అధికమాసం కారణంగా ఈ ఏడాది స్వామివారికి రెండోసారి బ్రహ్మోత్స వాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కన్యా మాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్‌ఏఐ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ అత్యంత శక్తిమంతమైన ఏఐ మోడళ్లకు సంబంధించిన శిక్షణ, అభివృద్ధి, ఇతర టూల్ ఆధారిత వినియోగాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. శిక్షణలో ఉన్న ఒక ఏఐ ఏజెంట్, సంస్థ విధించిన ఇంటర్నెట్ భద్రతా వలయాన్ని ఛేదించుకుని ప్రభుత్వ వెబ్ సైట్లలోకి చొరబడడమే ఇందుకు కారణం. ఈ ఘటనతో అప్రమత్తమైన ఓపెన్‌ఏఐ, భద్రతా లోపాలను సరిదిద్దే వరకు ఈ పాక్షిక విరామం కొనసాగుతుందని స్పష్టం చేసింది.



## రూ.500తో లాటరీ టికెట్ కొంటే రూ.30కోట్లు!

తిరువనంతపురం: కేరళలో ప్రతి ఏటా ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసే తిరువోణం బంపర్ లాటరీ ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఏడాది ఏకంగా రూ. 30 కోట్ల భారీ జాక్‌పాట్‌ను ఒక అదృష్టశాలి గెలుచుకున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరువనంతపురంలోని గోర్కీ భవన్‌లో ఈ లాటరీ డ్రాను నిర్వహించారు. ఈ డ్రాలో టీఎల్ 360615 నంబర్ గల టిక్కెట్‌కు మొదటి బహుమతి లభించింది. ఈ అదృష్ట టిక్కెట్‌ను కన్నూర్ జిల్లా చక్కరక్కల్ ప్రాంతానికి చెందిన ముత్తు లాటరీ ఏజెన్సీ (ఏజెంట్ అనీష్) విక్రయించినట్లు అధికారులు తెలిపారు. ఈసారి - 2 వ పేజీలో...

## దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ రైలు

### సబర్మతిలో ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా

### డీజిల్ వాడకాన్ని 40% వరకు తగ్గించే టెక్నాలజీ



న్యూఢిల్లీ: భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు ఇంధనంతో నడిచే రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సబర్మతిలో జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే కార్యకలాపాల్లో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్ఎన్‌జీ వాడకానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. సాంప్రదాయ డీజిల్ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ -2 వ పేజీలో...

## బోయింగ్ విమానాల్లో సాఫ్ట్ వేర్ లోపాలు

### భారత్‌లో 96 విమానాలపై ఎఫెక్ట్






## రాశి ఫలాలు

28.9.2026

మేషం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సన్నిహితులతో వివాదాలు తొలగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. సన్నిహితుల నుండి ఆసక్తికరమైన సమాచారం అందుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

వృషభం: చేపట్టిన పనుల్లో తొందరపాటు మంచిది కాదు. వ్యాపారాలు, ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. దైవ దర్శనాలు చేసుకుంటారు. ధన వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

మిధునం: బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపార , ఉద్యోగాలలో ఒత్తిడులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి.

కర్కాటకం: వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలుచేస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తినిస్తాయి. కీలక సమయంలో స్వంత ఆలోచనలు కలిసివస్తాయి. సంఘంలో గౌరవమర్యాదలకు లోటు ఉండదు.

సింహం: వ్యాపార, ఉద్యోగాలలో కొద్దిపాటి సమస్యలు తప్పవు. ఆరోగ్యపరంగా వైద్య సంప్రదింపులు అవసరమవుతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వృధా ఖర్చులు అదుపు చేయడం మంచిది.

కన్య: కుటుంబంలో ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. ప్రముఖులతో పరిచయాలు సంతోషాన్నిస్తాయి. ముఖ్యమైన పనుల్లో విజయం సాధిస్తారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. జీవిత భాగస్వామితో శుభకార్యాలలో పాల్గొంటారు. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది.

తుల: వ్యాపారాలలో ఒత్తిడులు తొలగుతాయి. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగాలలో కొద్దిపాటి సమస్యలు తప్పవు. వ్యయప్రయాసలతో కానీ పనులు పూర్తి కావు.

వృశ్చికం: ఉద్యోగాలలో పురోగతి సాధిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. చిరు వ్యాపారులకు ఆశించిన లాభాలు అందుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. చిన్ననాటి మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు.

ధనస్సు: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ధన వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

మకరం: వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఉద్యోగాలు కొంత నిరాశ కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయాలలో శ్రద్ధ వహించాలి. ఆదాయ మార్గాలు అంతంత మాత్రంగా ఉంటాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు తప్పవు.

కుంభం: వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వ్యయప్రయాసలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు.

మీనం: దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. కీలక సమయంలో



# అక్టోబర్ 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

మొదటి పేజీ తరువాయి

నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవని టీటీడీ స్పష్టం చేసింది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 16న అత్యంత కీలకమైన గరుడ వాహన సేవ, అక్టోబరు 19న స్వర్ణరథం, అక్టోబరు 20న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. సాధారణంగా ఉదయం వాహన సేవలు 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు కన్నుల పండువగా జరగనుంది.

నవరాత్రి బ్రహ్మోత్సవాల వాహన సేవల పూర్తి షెడ్యూల్:

అక్టోబరు 11: అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు)

అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6:30 గంటలకు)

అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)

అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు)

అక్టోబరు 20వ తేదీ ఉదయం జరిగే చక్రస్నానంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.



## రూ.500తో లాటరీ టికెట్ కొంటే రూ.30కోట్లు!

మొదటి పేజీ తరువాయి

ఓణం బంపర్ లాటరీకి కేరళ ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. లాటరీ శాఖ రూ. 500 ధరతో మొత్తం 90 లక్షల టిక్కెట్లను ముద్రించగా, అన్నీ అమ్ముడుపోయాయి. ఈ డ్రా చరిత్రలో టిక్కెట్లన్నీ అమ్ముడుపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీని ద్వారా ప్రభుత్వానికి టిక్కెట్ల అమ్మకాల రూపంలోనే రూ. 450 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ విజయం కేరళ రాష్ట్ర లాటరీల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. మొదటి బహుమతే కాకుండా రెండో బహుమతిగా 20 మందికి తలా రూ. 1 కోటి చొప్పున బహుమతులు దక్కాయి. టీఏ 957486, టీబీ 642974, టీసీ 810428 వంటి నంబర్లకు ఈ బహుమతులు లభించాయి. ఇవి కాకుండా రూ. 25 లక్షల నుంచి రూ. 500 వరకు అనేక ఇతర బహుమతులు కూడా ఉన్నాయి. వీటికి సంబంధించిన పూర్తి జాబితాను లాటరీ విభాగం అధికారికంగా విడుదల చేయనుంది. అయితే, విజేతకు ప్రకటించిన రూ. 30 కోట్లు పూర్తిగా చేతికి రావు. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం, లాటరీ బహుమతులపై పన్ను, సర్‌ఛార్జ్, సెస్ వంటివి మినహాయిస్తారు. ఈ కోతలన్నీ పోను మిగిలిన మొత్తాన్ని మాత్రమే విజేతకు అందజేస్తారు. ప్రస్తుతం మొదటి బహుమతి గెలుచుకున్న వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. విజేత తన అసలు టిక్కెట్‌తో పాటు అవసరమైన ధ్రువపత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించి, నగదును క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఓణం పండుగ సందర్భంగా నిర్వహించే ఈ బంపర్ డ్రా కేరళలో అత్యంత ప్రజాదరణ పొందిన లాటరీలలో ఒకటిగా పేరుగాంచింది.



## 1 నుంచి ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు కాస్ట్‌లీ

మొదటి పేజీ తరువాయి

కొనసాగుతుండటంతో ప్రముఖ గృహోపకరణాలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు మరోసారి ధరలు పెంచుతున్నాయి. ఈ ఖర్చుల భారాన్ని తట్టుకోలేక బ్లూ స్టార్, గోద్రెజ్, హైయర్, డైకిన్, ఎల్‌జీ వంటి దిగ్గజ కంపెనీలు అక్టోబర్ 1 నుండి తమ ఉత్పత్తుల ధరలను 2-10 శాతం వరకు పెంచేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది ప్రారంభం నుండి గృహోపకరణాల తయారీ పరిశ్రమ ధరలను పెంచడం ఇది మూడోసారి కావడం విశేషం. ఈ నిర్ణయంతో ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఎల్ఈడీ టీవీల కొనుగోలుపై వినియోగదారుల బడ్జెట్ మరింత పెరగనుంది. ముఖ్యంగా ఎయిర్ కండిషనర్ల ధరలు 5-8 శాతం వరకు పెరగవచ్చని కంపెనీల నుంచి సంకేతాలు వస్తున్నాయి. ఎయిర్ కండిషనర్ల(ఏసీ) విభాగంలో ఇప్పటికే పెంపు మొదలైంది. పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ సంక్షోభం, అంతర్జాతీయంగా కరెన్సీ అస్థిరత, రవాణా ఛార్జీలు పెరగడంతో పాటు రాగి, ఉక్కు, అల్యూమినియం, ప్లాస్టిక్ ధరలు నిరంతరం పెరగడమే ఈ ధరల పెంపునకు ప్రధాన కారణమని తయారీదారులు వివరిస్తున్నారు. ముఖ్యంగా ఎయిర్ కండిషనర్ల తయారీలో కీలకమైన రాగి ధర గతేడాది మెట్రిక్ టన్నుకు 8,000 డాలర్ల(మన కరెన్సీలో రూ. 7.70 లక్షల) నుండి ఏకంగా 14,500 డాలర్ల(రూ. 14 లక్షల)కు చేరుకుంది. ఒక ఏసీ తయారీలో సాధారణంగా 3-4 కిలోల రాగి అవసరమవుతుంది. దీనివల్ల ఏసీల ధరలు 5 నుండి 8 శాతం వరకు పెరిగాయి. గత ఏడాది పండుగ సీజన్‌తో పోలిస్తే కంపెనీ ఖర్చులు దాదాపు 15 శాతం పెరిగాయని, ఈ అదనపు భారాన్ని కంపెనీలు పూర్తిగా భరించడం సాధ్యం కాదని బ్లూ స్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి. త్యాగరాజన్ పేర్కొన్నారు. అయితే వినియోగదారులకు లభిస్తున్న జీఎస్టీ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటే, వారి మీద పడే నికర భారం సుమారు 5 శాతం ఉండొచ్చని ఆయన చెప్పారు.

## 30 రోజుల ప్లాన్ కచ్చితం

మొదటి పేజీ తరువాయి

రెన్యూవల్ అయ్యేలా ఒక ప్రత్యేక ప్లాన్‌ను కూడా అందించాలని ట్రాయ్ టెలికాం సంస్థలను ఆదేశించింది. ఈ మార్పుల వెనుక రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా కీలక పాత్ర పోషించారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తాను ఈ విషయాన్ని మార్చి 11న పార్లమెంటులో ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు. వినియోగదారులకు సౌకర్యవంతమైన, సరసమైన ఆప్షన్లు ఇవ్వాలని కోరానని, తన విజ్ఞప్తిని మన్నించి ఈ సమస్యను పరిష్కరించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ట్రాయ్‌కి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్‌లపై నిబంధనలు తెచ్చినా, కంపెనీలు ఎక్కువ వ్యాలిడిటీ ఉన్న డేటా-బండిల్డ్ ప్లాన్‌లనే ప్రోత్సహిస్తున్నాయని ట్రాయ్ గుర్తించింది. దీనివల్ల కేవలం వాయిస్ కాల్స్ కోసం మొబైల్ వాడే తక్కువ ఆదాయ వర్గాల వారు ఇబ్బంది పడుతున్నారని అభిప్రాయపడింది. వినియోగదారులకు వారి అవసరాలు, ఆర్థిక స్తోమతకు అనుగుణంగా రీఛార్జ్ చేసుకునే స్వేచ్ఛను కల్పించడమే ఈ కొత్త నిబంధనల లక్ష్యమని ట్రాయ్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో కోట్లాది మంది ప్రీపెయిడ్ వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.

## జెమినిలోనే ఫ్లిప్‌కార్ట్ షాపింగ్

మొదటి పేజీ తరువాయి

గూగుల్ జెమిని లేదా ఏఐ సెర్చ్‌లో వెతికినప్పుడు కనిపించే ఫ్లిప్‌కార్ట్ ఉత్పత్తి పక్కన "బై" బటన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయగానే, గూగుల్ విండో నుంచి బయటకు వెళ్లకుండానే ఫ్లిప్‌కార్ట్‌కు సంబంధించిన చెల్లింపు పేజీ ఓపెన్ అవుతుంది. అక్కడే కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను ఎంపిక చేసిన కొద్దిమంది వినియోగదారులకు, స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్స్, మొబైల్ యాక్సెసరీస్ వంటి పరిమిత ఉత్పత్తులతో పరీక్షిస్తున్నారు. వివిధ కథనాల ప్రకారం, రాబోయే పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, 2026 అక్టోబర్ నాటికి ఈ సదుపాయాన్ని దేశవ్యాప్తంగా ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకురావాలని గూగుల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఏఐ చాట్‌బాట్‌లను కేవలం సమాచారం తెలుసుకునే సాధనాలుగా కాకుండా, వాటి ద్వారానే నేరుగా లావాదేవీలు జరిపే వేదికలుగా మార్చాలనే గూగుల్ విస్తృత వ్యూహంలో ఇది ఒక భాగం. ఈ ప్రయోగంపై గూగుల్ అధికారికంగా స్పందిస్తూ, "వినియోగదారులు వ్యాపారాలతో మరింత సులభంగా కనెక్ట్ అయ్యేందుకు ఎల్లప్పుడూ కొత్త ఫీచర్లను పరీక్షిస్తుంటాం" అని తెలిపింది. అయితే మరిన్ని వివరాలు వెల్లడించలేదు. ఇప్పటికే ఓపెన్‌ఏఐ, మెటా వంటి ప్రత్యర్థి సంస్థలు కూడా తమ ఏఐ ప్లాట్‌ఫామ్‌లలో షాపింగ్ ఫీచర్లను జోడించే పనిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఏఐ రంగంలో తమ ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు గూగుల్ ఈ అడుగు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## దేశంలోనే తొలి ఎల్‌ఎన్‌జీ రైలు

మొదటి పేజీ తరువాయి

ఇంధన వనరులను ప్రోత్సహించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకోసం డ్రైవింగ్ పవర్ కార్స్ ఇంజిన్లను డీజిల్-ప్లస్-ఎల్ఎన్‌జీ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌గా అభివృద్ధి చేశారు. సబర్మతి ఇంటిగ్రేటెడ్ కోచింగ్ డిపోలో 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల రెండు డీపీసీలను ఈ కొత్త విధానానికి మార్చారు. ఈ టెక్నాలజీ పనితీరును నిర్ధారించుకునేందుకు, మార్పిడి చేసిన రెండు డీపీసీలపై 2,000 కిలోమీటర్లకు పైగా ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశారు. రైల్వే శాఖ విడుదల చేసిన ట్రయల్ డేటా ప్రకారం, ఈ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్ ద్వారా డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించవచ్చు. దీనివల్ల ఇంధన ఖర్చు గణనీయంగా ఆదా అవ్వడంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల వంటి కాలుష్య కారకాల ఉద్గారాలు కూడా తగ్గుతాయి. ఒక డీపీసీపై ఏటా రూ. 11.9 లక్షలు, ఎనిమిది కోచ్‌ల రైలుపై సుమారు రూ. 23.9 లక్షల వరకు ఆదా అవుతుందని రైల్వే శాఖ అంచనా వేసింది. ప్రతి డీపీసీలో 2,200 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఎల్ఎన్‌జీ ట్యాంకును అమర్చారు. ఇందులో 850-900 కిలోల వరకు ఎల్ఎన్‌జీని నింపవచ్చు. ఒక్కసారి ట్యాంకును పూర్తిగా నింపితే రైలు సుమారు 1,600 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా రూ. 1,542 కోట్లకు పైగా విలువైన పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా సబర్మతిలో రూ. 700 కోట్లతో నిర్మించిన డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్ నిర్వహణ షెడ్‌ను ప్రారంభించి, ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను జెండా ఊపి పంపించారు. వీటితో పాటు అహ్మదాబాద్-పాలన్‌పూర్, అహ్మదాబాద్-సమఖియాలీ సెక్షన్లలో దేశీయ పరిజ్ఞానంతో తయారైన 'కవచ్' రైలు రక్షణ వ్యవస్థను, రెండు రైల్వే సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను, సబర్మతి-సర్ఖేజ్ సెక్షన్ డబ్లింగ్ పనులను కూడా ప్రారంభించారు. రైలు పనితీరుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఖర్చులను, కాలుష్యాన్ని తగ్గించేందుకు రైల్వే శాఖ చేస్తున్న ప్రయోగాలకు ఈ ఎల్ఎన్‌జీ రైలు నిదర్శనంగా నిలుస్తోంది.

## బోయింగ్ విమానాల్లో సాఫ్ట్ వేర్ లోపాలు

### భారత్‌లో 96 విమానాలపై ఎఫెక్ట్

వాషింగ్టన్: ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్ తమ 737 మ్యాక్స్ విమానాల్లో మరో సాఫ్ట్‌వేర్ లోపాన్ని గుర్తించింది. దీని ప్రభావం భారత్‌లో ఆకాశ ఎయిర్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు నడుపుతున్న సుమారు 96 విమానాలపై పడనుంది. ల్యాండింగ్ సమయంలో ఒకసారి విఫలమై, రెండోసారి వేరే మార్గంలో ప్రయత్నించే క్రమంలో (మిస్డ్ ల్యాండింగ్ అప్రోచ్) ఆటోమేటెడ్ ఫ్లైట్ గైడెన్స్ సిస్టమ్ పనిచేయడం ఆగిపోయే అవకాశం ఉందని బోయింగ్ వెల్లడించింది. పీటీఐ తన కథనంలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఈ సమస్యపై బోయింగ్ గత నెలలోనే అన్ని 737 ఆపరేటర్లను అప్రమత్తం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో పైలట్లు ఆటోమేషన్ తగ్గిపోవడాన్ని గమనించవచ్చని, దీన్ని సురక్షితంగా ఎలా ఎదుర్కోవాలో ఇప్పటికే ఉన్న విధానాలను బలోపేతం చేస్తూ మార్గదర్శకాలను పంచుకున్నట్లు తెలిపింది. తాత్కాలిక నివారణ చర్యగా, 'మిస్డ్ అప్రోచ్' తర్వాత సిస్టమ్‌ను రీసెట్ చేయాలని ఆపరేటర్లకు సూచించింది. శాశ్వత పరిష్కారం కోసం తమ ఇంజనీర్లు ఒక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను అభివృద్ధి చేస్తున్నారని బోయింగ్ ప్రతినిధి ఒకరు ధృవీకరించారు. భారత్‌లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వద్ద సుమారు 53, ఆకాశ ఎయిర్ వద్ద 43 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు ఉన్నాయి. ఈ సమస్యపై ఆకాశ ఎయిర్ స్పందిస్తూ.. తమ విమానాల భద్రతకు ఎలాంటి ముప్పు లేదని, నిర్దేశిత విధానాలు, నియంత్రణ సంస్థల నిబంధనల ప్రకారమే సర్వీసులు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా బోయింగ్ 2,400కు పైగా 737 మ్యాక్స్ విమానాలను డెలివరీ చేసింది.

# నేతన్నల బకాయిలేవి?

మొదటి పేజీ తరువాయి

చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ. 3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ. 20 వేలకు పెంచామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు. "నేతన్నల బకాయిలు రూ. 60 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు? నిలిపివేసిన 10% యార్న్ సబ్సిడీ, రూ. 5 లక్షల నేతన్న బీమా ఎప్పుడు పునరుద్ధరిస్తారు? తేదీలు ప్రకటించాలి" అని ప్రశ్నించారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ ప్రారంభించి కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు. రైతుబంధును రూ. 15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలు, రూ. 2 లక్షల రుణమాఫీ సంపూర్ణ అమలు, నిలిచిపోయిన రైతుబీమా పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు? స్పష్టమైన తేదీలు ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 1,604 కోట్లతో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని ఎప్పుడు తరలిస్తారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, రూ. 400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రూ. 1,564 కోట్లతో సిరిసిల్ల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ. 40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఆసరా పెన్షన్లను రూ. 4 వేలకు ఎప్పుడు పెంచుతారని, 33 నెలలుగా మహిళలకు బాకీ ఉన్న రూ. 82,500 మహాలక్ష్మి సాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు రూ. 12 వేల సాయం వంటి హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ, నిలిపివేసిన గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కోరారు. చైతన్యానికి ప్రతీక అయిన సిరిసిల్ల గడ్డపైకి వస్తున్న ముఖ్యమంత్రి, ప్రజల పక్షాన తాము లేవనెత్తిన ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి, తన పర్యటనకు సార్థకత చేకూర్చాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

# అడ్డదిడ్డంగా రోడ్డు విస్తరణ!

## ప్రైవేటు స్థలంలో విద్యుత్తు టవర్ ఏర్పాటుకు యత్నం

## సొంత మురికి కాలువలోకి ఇతర వ్యర్థ జలాలు పంపే ప్రయత్నం

## వేములవాడలో మహాంకాళీ ఆలయ సమీపంలో స్థానికుల గోడు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): వేములవాడలో 80 అడుగుల రహదారి విస్తరణ పనుల్లో డ్రైనేజీ, విద్యుత్ టవర్ల నిర్మాణంపై తీవ్ర వివాదం నెలకొంది. మహాంకాళీ ఆలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మురికి కాలువ నిర్మాణంపై గత కొద్ది రోజులుగా వివాదం నడుస్తోంది. ఇందుకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ దుందుడుకు చర్యలే కారణం అని తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. వేములవాడ పట్టణంలో మూలవాగు వంతెన నుంచి శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం వరకు 80 ఫీట్ల రహదారి వెడల్పు పనులు జరుగుతున్నాయి. 2001లో అనుమతులతో దుకాణాలు (ఇంటి నంబర్లు 2-5-58/1, 2-5-58/2, 2-5-58/3, 2-5-58/4, 2-5-58/5) నిర్మించుకున్న యజమానులు కోయల్ కార్ లక్ష్మీబాయి, మహేష్, శశికుమార్, రాజు తదితరులు తమ సొంత ఖర్చులతో 18 అంగుళాల (ఫీటున్నర) తాత్కాలిక మురుగు కాలువను ఏర్పాటు చేసుకున్నారు. అయితే, ప్రస్తుత రోడ్డు విస్తరణలో భాగంగా ప్రభుత్వం 5 అడుగుల మురుగు కాలువను నిర్మిస్తోంది. అప్పటికే వ్యక్తిగతంగా కట్టుకున్న మురికి కాలువను, ప్రభుత్వ ఆస్తి అన్నట్లుగా అధికారులు తప్పుల మీద తప్పులు చేసినట్లు తెలిసింది. రహదారి మధ్య నుంచి 35 ఫీట్ల వ్యవధి వదిలి కాలువ నిర్మించాల్సి ఉండగా, అధికారులు ఆ 5 ఫీట్ల పెద్ద కాలువను స్థానికులు వేసుకున్న చిన్న కాలువకు కలపడానికి ప్రయత్నించటమే అసలు సమస్య.



### కలెక్టర్ సారూ.. ఆదుకోరూ..!

తాము 10 ఫీట్ల మేర స్థలాన్ని కోల్పోవాల్సి వస్తోందని, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు (టీపీబీవో వినోద్ కుమార్ తదితరులు) సాయంత్రం 6 గంటల తర్వాత కూడా పనులు చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్యుత్ టవర్ల ఏర్పాటు కోసం వచ్చిన అధికారులను అడ్డుకుని స్థానికులు సుమారు నాలుగు గంటల పాటు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల నుంచి వివరాలు సేకరించారు. ఆ తర్వాత మున్సిపల్ కమిషనర్ లోకేష్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ముందుగా 80 అడుగుల రహదారికి స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేసిన తర్వాతే మురుగు కాలువ నిర్మాణం చేపడతామని, ఆ పనులు పూర్తయిన తర్వాతే విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అయితే, తప్పుగా.. ప్రైవేట్ ఆస్తుల్లోకి చొరబడాలని చూసిన అధికారులపై చర్యల సంగతి ఏంటో ఉన్నతాధికారులే చెప్పాలి.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

మల్యాల, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమ నాయకుడిగా కొండా లక్ష్మణ్ బాపూజీ అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. పద్మశాలి సమాజ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి, చేనేత రంగం అభివృద్ధికి బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. చేనేత రంగం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, యువత బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, విద్య, సామాజిక సమానత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బాపూజీ ఆశయాల సాధనకు పద్మశాలి సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అలాగే, బాపూజీ చేసిన సేవలను గుర్తించి వరంగల్‌లో కొత్తగా నిర్మించనున్న విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తాటిపాముల రాజేందర్, ఉపాధ్యక్షులు వీరబత్తిని ప్రసాద్, కస్తూరి విశ్వనాథం, కోశాధికారి బొమ్మకంటి గంగాధర్, సహాయ కార్యదర్శి బుదారపు గంగామల్లు, కొండబత్తిని త్రినాథ్, పెంట సుధాకర్, బాలె శ్రీనివాస్, కటకం శ్రీనివాస్, కొక్కుల సుధాకర్, బాలె సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్ విమానాశ్రయానికి బాపూజీ పేరు పెట్టాలి

వరంగల్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): టీపీయూఎస్, టీపీఆర్‌యూఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను స్మరించుకున్నారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించాలని, వరంగల్ జిల్లాలో కొత్తగా నిర్మించబోయే విమానాశ్రయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు ప్రధాన కార్యదర్శి దాసరి ప్రేమ్ సాగర్, టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, సహాధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కొండా శ్రీనివాస్, కోశాధికారి బూర తిరుపతయ్య, ప్రచార కార్యదర్శి కోడూరి రమేష్, గడ్డం రాజ్‌కుమార్, సిరిపురం శేఖర్, వద్నాల వెంకటస్వామి, ములుక శ్రీనివాస్, టీపీఆర్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు బిట్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండు కామేశ్వరరావు, నాయకులు పాశికంటి చంద్రశేఖర్, గజ్జెల్లి రవీందర్, గుర్రపు సుధాకర్ రావు, పడాల సోమయ్య, చిమ్మని రాజన్ బాబు, కొండాబత్తుల రాజేంద్రం, దేవులపల్లి సదానందం, ఆముదాల భాస్కర్, గొల్లపల్లి విద్యాసాగర్, గజ్జెల్లి కోటేశ్వర రావు, ములక సాంబయ్య, ఎలగం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## బలవంతాపూర్ శివారులో యువకుడి ఆత్మహత్య

మల్యాల, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బలవంతపూర్ గ్రామ శివారులో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా డోన్ మండలం దొరపల్లి గ్రామానికి చెందిన రాచోటి అద్దాల ఎల్లయ్య కుటుంబంతో కలిసి ప్రస్తుతం నర్సింగాపూర్ శివారులో నివాసం ఉంటూ చిల్లర బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎల్లయ్య కుమారుడు రాచోటి అద్దాల చరణ్ (24) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు బట్టల వ్యాపారం నిమిత్తం ఈభూతి శేఖర్‌తో కలిసి కొండగట్టుకు వెళ్లాడు. ఉదయం 11 గంటల వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించగా.. బలవంతపూర్ గ్రామ శివారులోని శివాలయం సమీపంలో వేపచెట్టుకు ఉరివేసుకుని మృతిచెందిన స్థితిలో చరణ్ కనిపించాడు. మృతుడి తండ్రి రాచోటి అద్దాల ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మల్యాల ఎస్ఐ ఎస్. సందీప్ తెలిపారు.

# వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో తెలంగాణ యువత సత్తా

**లాజిస్టిక్స్, ఫ్రైట్ ఫార్వార్డింగ్‌లో మెహ్రున్నిసాకు రజత పతకం**

**క్యాబినెట్ మేకింగ్‌లో కె. యశ్వంత్ చారికి మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్**

**తెలంగాణ నుంచి ముగ్గురు పాల్గొనగా ఇద్దరికి గుర్తింపు**



షాంఘై, సెప్టెంబర్ 27: చైనాలోని షాంఘైలో జరిగిన వరల్డ్‌స్కిల్స్ పోటీలు-2026లో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. తెలంగాణ నుంచి ముగ్గురు పోటీదారులు పాల్గొనగా.. లాజిస్టిక్స్ అండ్ ఫ్రైట్ ఫార్వార్డింగ్ విభాగంలో మెహ్రున్నిసా రజత పతకం, క్యాబినెట్ మేకింగ్ విభాగంలో కె. యశ్వంత్ చారి మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించారు. తెలంగాణ యువత ప్రపంచస్థాయి నైపుణ్య పోటీల్లో ప్రతిభ కనబరచడం పట్ల శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి హర్షం వ్యక్తం చేశారు. మెహ్రున్నిసా, కె. యశ్వంత్ చారిని అభినందించారు. ప్రపంచ వేదికపై తెలంగాణకు గుర్తింపు తీసుకురావడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. వరల్డ్‌స్కిల్స్ షాంఘై-2026లో భారత్ 10వ స్థానంలో నిలిచి ఆరు రజత పతకాలు, 20 మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులు సాధించిందని మంత్రి తెలిపారు. 2024లో ఫ్రాన్స్‌లో జరిగిన వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో భారత్ 13వ స్థానంలో నిలవగా.. ఈసారి 10వ స్థానానికి చేరుకోవడం దేశ యువత నైపుణ్య సామర్థ్యానికి నిదర్శనమన్నారు. భారత్ తరఫున 70 మంది పోటీదారులు 63 నైపుణ్య విభాగాల్లో పాల్గొన్నారు. ఆధునిక సాంకేతికత, అధునాతన తయారీ, ఇంజినీరింగ్, డిజిటల్, సృజనాత్మక, సేవా రంగాలకు చెందిన విభాగాల్లో భారత యువత తమ ప్రతిభను ప్రదర్శించిందన్నారు. తెలంగాణ నుంచి పాల్గొన్న ముగ్గురిలో ఇద్దరు అంతర్జాతీయ స్థాయిలో పతకంతో పాటు గుర్తింపు సాధించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని మంత్రి అన్నారు. మెహ్రున్నిసా సాధించిన రజత పతకం, కె. యశ్వంత్ చారి సాధించిన మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ తెలంగాణ యువత నైపుణ్యానికి నిదర్శనమని తెలిపారు. గత వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో తెలంగాణకు కాంస్య పతకం లభించగా.. ఈసారి రజత పతకంతో పాటు మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించడం ద్వారా రాష్ట్ర యువత తమ ప్రతిభను చాటారని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ యువతలో అపారమైన ప్రతిభ, నైపుణ్యం ఉన్నాయని, వారికి అత్యుత్తమ శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలతో అనుసంధానం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన అవకాశాలు కల్పిస్తే మరిన్ని విజయాలు సాధించగలరని అన్నారు. నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, యువతను భవిష్యత్ ఉపాధి అవకాశాలకు, అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేస్తున్న కార్యక్రమాలకు ఈ విజయాలు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయని మంత్రి తెలిపారు.

# ఎర్ర తిరుపతి-రాధ దంపతులకు ఘన సన్మానం



హసన్‌పర్తి, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): ఉపాధ్యాయ వృత్తిలో మూడు దశాబ్దాలపాటు విశిష్ట సేవలందించి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పీఆర్‌టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి ఎర్ర తిరుపతి, రాధ దంపతులను ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. హసన్‌పర్తి మండలం చింతగట్టు పరిధిలోని ఎంటీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం పీఆర్‌టీయూటీఎస్ ఎల్కతుర్తి మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ అభినందన, సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎర్ర తిరుపతి-రాధ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడంతోపాటు ఉపాధ్యాయ సంఘం బలోపేతానికి ఎర్ర తిరుపతి అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ అనేది బాధ్యతల నుంచి వైదొలగడం మాత్రమేనని, సమాజానికి సేవ చేసే అవకాశం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. సంఘ నిర్మాణంతోపాటు సమాజ సేవలోనూ మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఎర్ర తిరుపతి గత 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అనేక మంది విద్యార్థులకు విద్యాబోధనతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ నాయకులు, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల అధికారులు, వివిధ మండలాల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చందుర్తి, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపంటి రామస్వామిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రామస్వామి గతంలో ఒకవైపు అంబేద్కర్ విగ్రహాన్ని తానే ఏర్పాటు చేయించానని, శిలాఫలకంపై తన పేరు ఉందని చెబుతూనే.. మరోవైపు అంబేద్కర్‌పై, దళితులపై అవమానకరంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అధికార పార్టీ అండదండలతో దళితులకు ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కుల ద్వారానే రామస్వామి ప్రజాప్రతినిధిగా గెలిచారని, అలాంటి అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించేలా మాట్లాడటం సమాజాన్ని కించపరచడమేనని నాయకులు పేర్కొన్నారు. రామస్వామిపై చట్టపరమైన చర్యలు తీసుకుని 24 గంటల్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు తక్షణమే స్పందించకపోతే సెప్టెంబర్ 30న సిరిసిల్లకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను దళిత సంఘాల ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ డివిజన్ సంఘం అధ్యక్షుడు దుమ్మ ఆనంద్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నిరాటి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బిక్షపతి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆవునూర్ ప్రభాకర్, మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు బత్తుల కమలాకర్, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, దళిత శక్తి ప్రోగ్రాం నాయకుడు ప్రకాష్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, గుడిసె మనోజ్ కుమార్, కటుకూరు ప్రశాంత్, ఏసుకుమార్ తదితర దళిత, కుల సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.



## సింగపూర్‌లో మల్యాల వాసుల ఆత్మీయ కలయిక

**జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ 170 మంది గెట్‌టుగెదర్**

మల్యాల, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): స్వగ్రామానికి దూరంగా సింగపూర్‌లో స్థిరపడిన మల్యాల వాసులు తమ ఊరి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా కలుసుకున్నారు. సింగపూర్‌లో నిర్వహించిన గెట్‌టుగెదర్ కార్యక్రమానికి మల్యాలకు చెందిన సుమారు 170 మంది హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు, గ్రామంలోని స్నేహితులు, పండుగలు, పాఠశాల రోజులు, స్వగ్రామంతో తమకున్న అనుబంధాన్ని ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న పాత మిత్రులు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. స్వగ్రామానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ మల్యాలపై తమకున్న అభిమానం, ఆత్మీయత ఏమాత్రం తగ్గలేదని ఈ కలయిక చాటిచెప్పింది. ఉద్యోగాలు, వ్యాపారాల కోసం సింగపూర్‌లో స్థిరపడిన మల్యాల వాసులంతా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. "ఎక్కడ ఉన్నా.. మన ఊరు మల్యాలే.. మన బంధం మల్యాల వాసులదే" అంటూ పాల్గొన్న వారు స్వగ్రామంపై తమకున్న ప్రేమను చాటుకున్నారు.

## అర్ధరాత్రి వివాహిత అదృశ్యం



మల్యాల, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): మల్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లి హ్యాబిటేషన్ పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన పత్రి రాజశేఖర్ (లక్ష్మణ్ కుమారుడు) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సుమారు ఎనిమిదేళ్ల క్రితం సంగీతను వివాహం చేసుకోగా.. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెప్టెంబర్ 26న రాజశేఖర్ పని నిమిత్తం నిజామాబాద్‌కు వెళ్లాడు. భార్య సంగీత, ఇద్దరు పిల్లలు తన తల్లి పత్రి లక్ష్మి వద్దే ఉండాలని చెప్పి వెళ్లాడు. అదే రోజు రాత్రి సుమారు 8.30 గంటలకు కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రించారు. అయితే సెప్టెంబర్ 27న తెల్లవారుజామున సుమారు 3.30 గంటలకు పత్రి లక్ష్మి బాత్రూమ్‌కు వెళ్లేందుకు లేవగా.. సంగీత ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆమె వెంటనే రాజశేఖర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించింది. ఇంటికి చేరుకున్న రాజశేఖర్ బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాలు, సమీప గ్రామాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో రాజశేఖర్ మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఎస్. సందీప్ ఫిర్యాదు స్వీకరించి అదృశ్యం కేసు నమోదు చేశారు. మహిళ ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో ప్రత్యేక పూజలు



జగిత్యాల, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): భాద్రపద మాసం శుక్ల పక్ష పాడ్యమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పల్లకి సేవ చేపట్టారు. హిందూ సంప్రదాయంలో ఆదివారం సూర్య భగవానుడికి ప్రత్యేకమైన రోజుగా భావిస్తారు. ఈ రోజున సూర్యదేవుడిని ఆరాధించడం వల్ల ఆరోగ్యం, ఆయుష్షు, విజయం, సంపద, కీర్తి లభిస్తాయని భక్తుల విశ్వాసం. పాడ్యమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ఉచితంగా అమృత నిర్గుండి కషాయం వితరణ చేశారు. అనంతరం భక్తులు సూర్య భగవానుడికి ముడుపులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొద్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, సహాయ కోశాధికారి గోపి, భారతాల రాజసాగర్, వేముల రాజేష్, యాంసాని శంకరయ్య, లక్ష్మీనారాయణ-జ్యోతి, రవికుమార్-అనూష, అడ్లగట్ట రవీందర్, చెన్న సుధాకర్, మల్లేశం, హరికృష్ణ, అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## నూకలమర్రి విద్యార్థినికి అరుదైన అవకాశం

**మోదీకి ఎన్ఐటీ వరంగల్‌లో రూపొందించిన సెమీకండక్టర్ చిప్ ప్రదర్శన**

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన కైర అనుపమ ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో 2010–11 బ్యాచ్ విద్యార్థినిగా చదివిన అనుపమ ప్రస్తుతం ఎన్ఐటీ వరంగల్‌లో పీహెచ్‌డీ పరిశోధకురాలిగా ఉన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ శ్రీహరి రావు పత్రీ పర్యవేక్షణలో సెమీకండక్టర్, వీఎల్ఎస్ఐ రంగాల్లో పరిశోధనలు చేస్తున్నారు. ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన సెమికాన్ ఇండియా–2026లో ఎన్ఐటీ వరంగల్‌కు ప్రాతినిధ్యం వహించిన అనుపమ.. సంస్థలో పరిశోధనలో భాగంగా రూపొందించిన, ఎస్‌సీఎల్ మొహాలీ, చండీగఢ్‌లో తయారైన సెమీకండక్టర్ చిప్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో చిప్‌కు సంబంధించిన అంశాలపై ఆమె చర్చించారు. ఎన్ఐటీ వరంగల్ అధికారిక సమాచారం ప్రకారం.. భారతదేశంలో చిప్ రూపకల్పన, సెమీకండక్టర్ సాంకేతికత భవిష్యత్తుపై దృష్టి సారించిన కార్యక్రమంలో అనుపమ పాల్గొన్నారు. వీఎల్ఎస్ఐ అనలాగ్ డొమైన్‌లో పరిశోధనలు చేస్తున్న ఆమె.. 'సెన్సార్ సర్క్యూట్ల కోసం పవర్ మేనేజ్‌మెంట్ ఐసీలు' అంశంపై పరిశోధన చేస్తున్నారు. భారత్‌లో సెమీకండక్టర్ రంగంలో పరిశోధన, రూపకల్పన, తయారీ, ప్యాకేజింగ్ తదితర విభాగాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సెమికాన్ ఇండియా–2026ను న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52 దేశాల నుంచి ప్రతినిధులు, 600కుపైగా కంపెనీలు పాల్గొన్నాయి. కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ పూర్వ విద్యార్థినిగా చదివిన అనుపమ జాతీయ స్థాయి సెమీకండక్టర్ వేదికపై ఎన్ఐటీ వరంగల్‌కు ప్రాతినిధ్యం వహించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షణ్ వస్ఫియ, డైరెక్టర్ హసన్ ఫసి ఉల్లాహ్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, వేములవాడ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో చిప్ రూపకల్పన, సెమీకండక్టర్ పరిశోధన రంగాల్లో అనుపమ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అమ్మ భాషకు అక్షరశాల



మనిషి జీవితంలో తొలి పలుకే అమ్మ మాట. ఆ మాటతోనే భాష పరిచయమవుతుంది. ఆ భాషతోనే ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం మొదలవుతుంది. అందుకే మాతృభాషను కేవలం సంభాషణ సాధనంగా చూడలేం. అది ఒక సమాజపు జ్ఞాపకం. ఒక జాతి చరిత్ర. ఒక ప్రాంతపు సంస్కృతి. తరతరాల అనుభవాలను తర్వాతి తరానికి అందించే వాహకం. ఆ భావనకు ఒక రూపం ఇస్తే.. అది అక్షరశాల. కోల్‌కతాలోని మ్యూజియం ఆఫ్ వర్డ్‌ను సందర్శించినప్పుడు కలిగే మొదటి అనుభూతి ఇదే.

ఒక అక్షరం కనిపిస్తే మనకు ఏమనిపిస్తుంది?
ఒక పదం కనిపిస్తే? ఒక భాష వినిపిస్తే?
సాధారణంగా ఇవన్నీ మన జీవితంలో సహజంగా
కలిసిపోయిన విషయాలే.
కానీ, అదే అక్షరాన్ని చరిత్రగా..అదే పదాన్ని జ్ఞాపకంగా..
అదే భాషను ఒక సజీవ వారసత్వంగా చూస్తే?
అప్పుడు అది మ్యూజియంగా మారుతుంది.
అదే.. కోల్‌కతాలోని 'మ్యూజియం ఆఫ్ వర్డ్'
ఇది వస్తువులను గాజుపెట్టెల్లో భద్రపరిచే మ్యూజియం కాదు..
మనిషి ఆలోచనకు రూపం ఇచ్చిన,
అక్షరం నుంచి.. భావానికి రూపమైన పదం వరకు..
పదాల సమాహారంగా ఎదిగిన
భాష వరకు తీసుకెళ్లే ఒక అక్షర యాత్ర.

'అమ్మ భాషను మరిచిపోకు' అని చెప్పే గోడలు కనిపించకపోయినా.. ప్రతి అక్షరం అదే విషయాన్ని చెబుతున్నట్లు అనిపిస్తుంది. అక్షరం పుట్టినప్పటి నుంచి మనిషి మాట్లాడటం నేర్చుకున్నాడు. తన భావాలను గుర్తులతో వ్యక్తం చేయడం నేర్చుకున్నాడు. ఆ గుర్తులు క్రమంగా అక్షరాలుగా మారాయి. అక్షరాలు పదాలయ్యాయి. పదాలు వాక్యాలయ్యాయి. వాక్యాలు కథలయ్యాయి. కథలు చరిత్రగా మారాయి. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి భాషా మ్యూజియం ఒక ప్రత్యేకమైన కిటికీలా నిలుస్తుంది. మనకు రోజూ కనిపించే అక్షరాల వెనుక ఎంత పెద్ద ప్రయాణం ఉందో ఆలోచింపజేస్తుంది. అక్షరం చిన్నదే.. కానీ దాని వెనుక ఉన్న చరిత్ర మాత్రం అనంతం. పదం అంటే కేవలం పదమేనా? 'అమ్మ' అనే పదాన్ని తీసుకుందాం. రెండు అక్షరాలే. కానీ ఆ పదంలో ఒక ప్రపంచం ఉంది. 'ఇల్లు' అనే పదం చిన్నదే. కానీ అందులో అనుబంధం ఉంది. 'దేశం' అనే పదంలో భావోద్వేగం ఉంది. 'స్వేచ్ఛ' అనే పదంలో చరిత్ర ఉంది. అందుకే పదానికి కేవలం అర్థం ఉండదు. పదానికి జ్ఞాపకం ఉంటుంది. భావం ఉంటుంది. సందర్భం ఉంటుంది. సంస్కృతి ఉంటుంది. మ్యూజియం ఆఫ్ వర్డ్ ప్రత్యేకత కూడా ఇక్కడే. పదాలను కేవలం చదివించే ప్రయత్నం కాకుండా.. వాటి వెనుక ఉన్న ప్రపంచాన్ని పరిచయం చేసే ప్రయత్నం.

### కోల్‌కతానే ఎందుకు అంటే..?

భాష, సాహిత్యం, ముద్రణ, పత్రికా రంగం, సామాజిక సంస్కరణలతో కోల్‌కతాకు ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది. బెంగాలీ సాహిత్యానికి ఈ నగరం అందించిన కృషి అపారమైనది. పుస్తకాలు, పత్రికలు, ముద్రణా సంస్కృతి, సాహిత్య ఉద్యమాలు.. ఇలా అక్షరంతో కోల్‌కతాకు విడదీయరాని బంధం ఉంది. అలాంటి నగరంలో పదాలకు, భాషకు అంకితమైన మ్యూజియం ఉండటం మరింత అర్థవంతంగా అనిపిస్తుంది. అక్షరాలతో చరిత్ర రాసుకున్న నగరం.. ఇప్పుడు అక్షరాల చరిత్రను చూపిస్తోంది. మ్యూజియం ఆఫ్ వర్డ్‌గా మరో ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. రోజూ వార్తలు రాసే జర్నలిస్టుకు అక్షరం ఒక పనిముట్టు. ఒక అక్షరం తప్పితే అర్థం మారుతుంది. ఒక పదం తప్పితే వార్త స్వరూపమే మారుతుంది. ఒక వాక్యం తప్పితే భావం మారిపోతుంది. అలాంటి అక్షరాలు, పదాల విలువను ప్రత్యక్షంగా గుర్తుచేసే ప్రదేశంలో నిలబడటం ఒక జర్నలిస్టుకు మరింత ప్రత్యేకమైన అనుభూతి. రోజూ అక్షరాలతో జీవించే వ్యక్తి.. అక్షరాల మ్యూజియంలోకి అడుగుపెడితే ఎలా ఉంటుంది? ఆ అనుభూతే ఈ అక్షరశాల. ప్రపంచంలో అనేక భాషలు క్రమంగా అంతరించిపోతున్నాయి. కొన్ని భాషలను మాట్లాడేవారి సంఖ్య తగ్గుతోంది. కొన్ని భాషలు కొత్త తరానికి చేరడం లేదు. కొన్ని భాషల్లోని పదాలు వాడుక నుంచి కనుమరుగవుతున్నాయి. ఒక భాష కనుమరుగైతే కేవలం కొన్ని పదాలు పోవు. ఆ భాషతో పాటు ఒక సమాజపు అనుభవం పోతుంది. ఒక సంస్కృతి పోతుంది. ఒక ప్రత్యేకమైన ప్రపంచ దృష్టి పోతుంది. అందుకే భాషను కాపాడటం అంటే కేవలం అక్షరాలను కాపాడటం కాదు. తరతరాల జ్ఞాపకాలను కాపాడటం.






(పీఐబీ హైదరాబాద్, పీఐబీ కోల్‌కతా సహకారంతో..)




(ఈవార్తలు - ఎడిటర్స్ నోట్)

### భాషలు వేరు.. భావం ఒక్కటే

భారతదేశం అంటేనే భాషల వైవిధ్యం. తెలుగు.. బెంగాలీ.. హిందీ.. తమిళం.. కన్నడ.. మలయాళం.. ఒడియా.. మరాఠీ.. పంజాబీ.. అస్సామీ.. ఇలా ఎన్నో భాషలు. అక్షరాలు మారవచ్చు. పదాలు మారవచ్చు. ఉచ్చారణ మారవచ్చు. కానీ మనిషి భావాలు మాత్రం చాలా సందర్భాల్లో ఒకటే. అమ్మపై ప్రేమ, నేలపై మమకారం, దేశంపై అభిమానం, ప్రకృతిపై ఆరాధన, మనుషుల మధ్య అనుబంధం, భాషలు వేరు చేసినట్లు కనిపించినా.. పదాలు మనుషులను కలుపుతాయి. అందుకే భాషా మ్యూజియం ఒక ప్రాంతానికి మాత్రమే చెందినది కాదు. అది మనిషి మాట్లాడటం నేర్చుకున్న చరిత్రకు చెందినది.



### అక్షరం నుంచి ఆలోచన వరకు..

మ్యూజియం నుంచి బయటకు వస్తున్నప్పుడు ఒక ఆలోచన వెంటాడింది. మనిషి చరిత్రలో ఎన్నో గొప్ప ఆవిష్కరణలు చేశాడు. చక్రం కనిపెట్టాడు. విద్యుత్తును వినియోగించాడు. అంతరిక్షంలోకి వెళ్లాడు. కృత్రిమ మేధను సృష్టించాడు. కానీ వీటన్నింటి గురించి తర్వాతి తరాలకు చెప్పింది ఏమిటి? అక్షరమే. మనం చరిత్రను తెలుసుకున్నది అక్షరాల వల్ల. మన పూర్వీకుల ఆలోచనలను తెలుసుకున్నది అక్షరాల వల్ల. మన అనుభవాలను భవిష్యత్తుకు అందించేది కూడా అక్షరమే. అందుకే.. అక్షరం చిన్నది కాదు. అది మనిషి జ్ఞాపకానికి చిరునామా. పదం సాధారణం కాదు. అది ఒక తరం నుంచి మరో తరానికి ప్రయాణించే భావం. భాష కేవలం మాట్లాడుకునే సాధనం కాదు. అది ఒక సమాజపు ఆత్మ. అలాంటిది.. ఈ అక్షరశాల మనిషి మాట్లాడిన తొలి మాట నుంచి.. రాసిన తొలి అక్షరం వరకు.. నిర్మించుకున్న నాగరికతకు ఒక జ్ఞాపకశాల.






సోమవారం 28-9-2026, జగిత్యాల

## ఒక వైపు వందల ఏళ్ల చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన హుగ్లీ నది..

మరోవైపు లక్షలాది మందిని గమ్యస్థానాలకు చేర్చే ఆధునిక నగరం

## ఈ రెండింటి మధ్య నుంచి ఓ మెట్రో రైలు దూసుకుపోతుంటే..

అది కేవలం ప్రయాణం కాదు.. చరిత్రను కళ్లారా చూస్తున్న అనుభూతి

## ఇంజినీరింగ్ సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా ఆస్వాదిస్తున్న అనుభవం

ఒళ్లు పులకరించే నదీగర్భ ప్రయాణం.. ఇదే కోల్‌కతా మెట్రో ప్రత్యేకత!!

**భారతదేశంలో మెట్రో రైలు వ్యవస్థకు తొలి అడుగు వేసిన నగరం కోల్‌కతా. 1984లో ఇక్కడే దేశపు తొలి మెట్రో సేవలు ప్రారంభమయ్యాయి. భారతీయ రైల్వే ఆధీనంలో ఉన్న ఈ మెట్రో.. కాలంతో పాటు విస్తరిస్తూ.. ఇప్పుడు దేశంలోనే అత్యంత ప్రత్యేకమైన ఇంజినీరింగ్ ఘనతల్లో ఒకటైన హుగ్లీ నది అడుగున మెట్రోను నడుపుతోంది.**

హుగ్లీ నదిని దాటాలంటే వంతెనలు, రహదారులు, పడవలు ప్రధాన మార్గాలు. కానీ కోల్‌కతా మరో మార్గాన్ని ఎంచుకుంది. నదిపై వంతెన నిర్మించకుండా.. నదీ గర్భం కింద నుంచి రైలు వెళ్లేలా సొరంగాన్ని నిర్మించింది. హౌరా మైదాన్-ఎస్ప్లనేడ్ మార్గంలోని మెట్రో సొరంగం హుగ్లీ నది కిందుగా సాగుతుంది. నదిని దాటే భాగం సుమారు 520 మీటర్లు. నది అడుగు భాగానికి సుమారు 13 మీటర్ల దిగువన ఈ సొరంగం నిర్మించారు. రెండు సొరంగాలను నిర్మించేందుకు భూమి ఒత్తిడిని సమతుల్యం చేసే సొరంగ తవ్వే యంత్రాలను వినియోగించారు. నదీ అడుగున సొరంగ నిర్మాణాన్ని 66 రోజుల్లో పూర్తి చేయడం ఈ ప్రాజెక్టు ఇంజినీరింగ్ సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. ఇది సాధారణ సొరంగం కాదు. ప్రతి క్షణం ఒత్తిడి, నీటి ముప్పు, భూగర్భ పరిస్థితులను ఎదుర్కొంటూ నిర్మించిన అద్భుతం. నదీ ప్రవాహానికి కిందుగా.. దాని అడుగు భాగానికి దిగువన.. వేలాది టన్నుల నీటి ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించిన మార్గం.

(ఈవార్తలు - ఎడిటర్స్ నోట్)



# హుగ్లీ ఒడిలో..

# మెట్రో పరుగులు



## (నదీ గర్భంలో అద్భుత ప్రయాణం)

రైలు కిటికీలో కనిపించని నది.. అనుభూతిలో మాత్రం హుగ్లీ

ప్రెస్ టూర్‌లో భాగంగా కోల్‌కతా మెట్రోలో ప్రయాణించే అవకాశం లభించింది.

మెట్రో రైలు కదిలింది.. స్టేషన్‌ను దాటి ముందుకు సాగింది.

కొద్దిసేపటికి మనం నగరంలోనే ఉన్నామా?

లేక హుగ్లీ నది గర్భంలోకి ప్రవేశించామా? అన్న భావన కలిగింది.

కళ్లకు కనిపించేది సొరంగమే. కానీ మనసుకు మాత్రం ఒకే ఆలోచన..

మనకు పైవైపు హుగ్లీ నది ప్రవహిస్తోంది!

రైలు వేగంగా ముందుకు వెళ్తుంటే..

పైభాగంలో ఒక మహానది తన సహజ ప్రవాహంతో సాగుతుండగా,

దాని కిందుగా మనం ప్రయాణిస్తున్నామనే భావన మాటల్లో చెప్పలేనిది.

సుమారు 550 మీటర్ల నదీ అడుగు మార్గాన్ని రైలు కొన్ని క్షణాల్లో దాటేస్తుంది. అధికారికంగా ఈ నీటి అడుగు ప్రయాణం సుమారు 45 సెకన్లపాటు ఉంటుంది. ప్రయాణ సమయం చిన్నదే అయినా.. ఆ అనుభూతి మాత్రం చాలా కాలం గుర్తుండిపోతోంది. ఒక జర్నలిస్టుగా ఎన్నో రైలు ప్రయాణాలు చేసి చేసి ఉండొచ్చు.. ఎన్నో నగరాలను చూసి ఉండొచ్చు.. కానీ ఒక మహానది కిందుగా మెట్రోలో ప్రయాణించడం మాత్రం పూర్తిగా భిన్నమైన అనుభవం. కోల్‌కతా మెట్రో ప్రత్యేకత హుగ్లీ నది కింద సొరంగంతోనే ఆగిపోదు. ఈ మార్గంలోని హౌరా మెట్రో స్టేషన్ భారతదేశంలోనే అత్యంత లోతైన మెట్రో స్టేషన్. భూగర్భంలో సుమారు 30 మీటర్ల లోతులో ఈ స్టేషన్ ఉంది. అంటే.. పైభాగంలో రద్దీగా ఉండే హౌరా నగరం, దాని కింద మరో ప్రపంచంలా మెట్రో స్టేషన్, దాని కింద నుంచి హుగ్లీ నది అడుగు భాగాన్ని దాటే సొరంగం. పైకి నగరం పరుగులు తీస్తుంటే.. కింద మెట్రో పరుగులు తీస్తోంది. కోల్‌కతా మెట్రో కథ నేటిది కాదు. 1984 అక్టోబర్ 24న ఎస్ప్లానేడ్ నుంచి భవానీపూర్ వరకు తొలి మెట్రో సేవలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో అది చిన్న మార్గమే కావచ్చు. కానీ అదే భారతదేశంలో పట్టణ రవాణా చరిత్రను మార్చిన తొలి అడుగు. ఆ తర్వాత దశాబ్దాలుగా మార్గాలు విస్తరిస్తూ.. కొత్త ప్రాంతాలను కలుపుతూ.. కోల్‌కతా నగర జీవితంలో మెట్రో విడదీయరాని భాగంగా మారింది. దేశంలో తొలి మెట్రోగా ప్రారంభమైన వ్యవస్థే ఇప్పుడు నదీ గర్భంలోకి దిగింది. ఇది కేవలం విస్తరణ కాదు. కాలంతో పాటు సాంకేతికత కూడా ఎలా పరిణామం చెందుతుందో చెప్పే కథ.

హుగ్లీ నది కోల్‌కతా, హౌరా నగరాలను భౌగోళికంగా వేరు చేస్తుంది. కానీ మెట్రో సొరంగం వాటి మధ్య ప్రయాణాన్ని మరింత సులభతరం చేసింది. హౌరా మైదాన్ నుంచి ఎస్ప్లనేడ్ వరకు 4.8 కిలోమీటర్ల మార్గం 2024 మార్చి 15న ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ఈ మార్గంలోనే భారతదేశపు తొలి ప్రధాన నది కింద నిర్మించిన మెట్రో రవాణా సొరంగం ఉంది. 2024 మార్చి 6న ఈ మార్గాన్ని ప్రారంభించిన సందర్భంగా దేశంలోనే తొలి నీటి అడుగు మెట్రోగా దీనిని అధికారికంగా పేర్కొన్నారు. అనంతరం మార్చి 15న ప్రయాణికులతో మెట్రో రైలు తొలిసారిగా హుగ్లీ కిందుగా పరుగులు తీసింది. ఒక నది కిందుగా రైలును నడపడం అంటే కేవలం సొరంగం తవ్వడం కాదు. భూగర్భ నిర్మాణం, నీటి ఒత్తిడి, నేల స్వభావం, భద్రత, గాలి ప్రసరణ, విద్యుత్, సంకేత వ్యవస్థలు.. ఇలా ఎన్నో అంశాలను సమన్వయం చేయాల్సి ఉంటుంది. హుగ్లీ కింద నిర్మించిన సొరంగంలో ఒక్కో సొరంగం అంతర్గత వ్యాసం సుమారు 5.55 మీటర్లు. భూమి పొరల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సొరంగ తవ్వే యంత్రాలను ఉపయోగించారు. అందుకే కోల్‌కతా మెట్రో ప్రయాణం ముగిసిన తర్వాత కూడా మనసులో ఒక ప్రశ్న మిగులుతుంది. పెద్ద నది కింద రైలును నడపాలన్న ఆలోచన మొదట ఎవరి మనసులో పుట్టి ఉంటుంది? ఆ ఆలోచనకు రూపం ఇచ్చిన ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, కార్మికులు, రైల్వే అధికారులు.. అందరి కృషి ఫలితమే ఈ సొరంగం.

### జర్నలిస్టుగా చూసినప్పుడు..

ప్రెస్ టూర్‌లో భాగంగా కోల్‌కతా మెట్రోలో ప్రయాణం ఒక వార్తా అంశాన్ని ప్రత్యక్ష అనుభవంగా మార్చింది. సాధారణంగా ఒక ప్రాజెక్టు గురించి రాస్తే.. దాని గణాంకాలు, నిర్మాణ వ్యయం, పొడవు, సాంకేతిక వివరాలు మాత్రమే మన ముందుంటాయి. కానీ ఈసారి పరిస్థితి భిన్నం. సొరంగం గురించి చదవలేదు.. సొరంగంలో ప్రయాణించాం. హుగ్లీ కింద మెట్రో గురించి వినలేదు.. హుగ్లీ కిందుగా ప్రయాణించాం. కోల్‌కతా మెట్రో చరిత్రను చదవలేదు.. ఆ చరిత్రలో కొంత దూరం మనమే ప్రయాణించాం. అందుకే ఈ ప్రయాణం ఒక సాధారణ మెట్రో ప్రయాణంలా అనిపించలేదు. ఒకవైపు 1984లో భారతదేశపు తొలి మెట్రోకు శ్రీకారం చుట్టిన నగరం. మరోవైపు 2024లో దేశపు తొలి ప్రధాన నది అడుగున మెట్రోను నడిపిన నగరం. నాలుగు దశాబ్దాల వ్యవధిలో కోల్‌కతా మెట్రో సాధించిన పరిణామం ఇదే. కోల్‌కతా మెట్రోను చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. నగరాలు పెరుగుతున్న కొద్దీ రవాణా అవసరాలు కూడా పెరుగుతాయి. రహదారులకు స్థలం పరిమితం. వంతెనలకు పరిమితులు ఉంటాయి. కానీ ఇంజినీరింగ్ కొత్త మార్గాలను సృష్టించగలదు. ఒకప్పుడు అసాధ్యంగా అనిపించిన ఆలోచన.. నేడు ప్రయాణికుల రోజువారీ జీవితంలో భాగమైంది. హుగ్లీ నదిపై నుంచి చూస్తే నీరే కనిపిస్తుంది. కానీ ఆ నీటి అడుగున ఒక సొరంగం ఉంది. ఆ సొరంగంలో మెట్రో రైలు ఉంది. ఆ రైలులో వేలాది ప్రయాణికుల కలలు, అవసరాలు, గమ్యాలు ఉన్నాయి.

అందుకే, కోల్‌కతా మెట్రో అంటే కేవలం రైలు కాదు. అది భారతదేశ రైల్వే-మెట్రో చరిత్రలో తొలి అడుగు. అది హుగ్లీ గుండెల్లో చెక్కిన ఇంజినీరింగ్ సంతకం. అది నిన్నటి చరిత్రను.. నేటి ప్రయాణంతో.. రేపటి నగరానికి కలుపుతున్న సొరంగం. హుగ్లీపై పడవలు సాగుతూనే ఉంటాయి.. వంతెనలపై వాహనాలు పరుగులు తీస్తూనే ఉంటాయి.. కానీ హుగ్లీ ఒడిలో కోల్‌కతా మెట్రో చరిత్రను మోస్తూ పరుగులు తీస్తోంది.

(పీఐబీ హైదరాబాద్, పీఐబీ కోల్‌కతా సహకారంతో..)








## ముగ్గురు బ్యూటీలతో వెంకీ..

# ‘నారాయణమ్మ’తో మాస్ టచ్

టాలీవుడ్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ లో రూపొందుతున్న ఆదర్శ కుటుంబం – హౌస్ నంబర్ 47 మూవీపై ఆడియన్స్ లో ఇప్పటికే హైప్ నెలకొంది. టీజర్ తో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా సినిమాపై అంచనాలు పెంచిన టీమ్.. ఇప్పుడు ఫస్ట్ సింగిల్ నారాయణమ్మతో మాస్ టచ్ చూపించింది. నారాయణమ్మ అంటూ సాగే ఆ సాంగ్ ను లేటెస్ట్ గా మూవీ టీమ్ రిలీజ్ చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన ఆ పాటను ప్రభ, రామ్ మిరియాల ఎనర్జిటిక్ గా ఆలపించారు. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించారు. పాటను చూస్తుంటే ఫెస్టివల్ ఎన్విరాన్మెంట్ ను తలపించేలా సందడిగా షూట్ చేసినట్లు కనిపిస్తోంది. అయితే ఆ సాంగ్ లో వెంకటేష్‌తో పాటు ముగ్గురు హీరోయిన్లు సందడి చేశారు. శ్రీనిధి శెట్టి, డింపుల్ హయాతి, నివేదా పేతురాజ్ తమ డ్యాన్స్ తో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. ముఖ్యంగా డింపుల్ హయాతి తన వైబ్రెంట్ స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకున్నారని చెప్పాలి. వెంకీ మామ కూడా ముగ్గురు బ్యూటీలతో కలిసి స్టెప్పులు వేయడం సాంగ్ కు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఇక నారాయణమ్మ పాట రెగ్యులర్ పార్టీ సాంగ్ తరహాలో సాగుతుంది. తమన్ ఇచ్చిన బీట్ కు తగ్గట్టుగా వెంకటేష్, హీరోయిన్ల డ్యాన్స్ ప్లాన్ చేశారు. అయితే ఫ్యామిలీ స్టోరీతో తెరకెక్కుతున్న సినిమాలో ఇలాంటి మాస్ సాంగ్ ఉండటం ఇంట్రెస్ట్ ను పెంచుతోంది. పాటలో కనిపించే సందడి, డ్యాన్స్ స్టెప్పులు సినిమా పూర్తిగా సీరియస్ గా కాకుండా ఎంటర్టైన్మెంట్ కు ఇంపార్టెన్స్ ఇస్తుందని క్లియర్ గా చెబుతోంది. ఇటీవల రిలీజ్ అయిన ఆదర్శ కుటుంబం టీజర్ కు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా వెంకటేష్ కనిపించబోతున్నట్లు టీజర్ ద్వారా చూపించారు. కుటుంబం చుట్టూ సాగే కథలో ఎంటర్టైన్మెంట్ తోపాటు ఎమోషన్స్, యాక్షన్ ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. టీజర్ డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో 20 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించినట్లు మూవీ టీమ్ తెలిపింది. ఇక‘ఆదర్శ కుటుంబం మూవీలో వెంకటేష్ కు జోడీగా యంగ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, డింపుల్ హయాతి, పూజిత పొన్నాడ, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ రచన, దర్శకత్వం వహిస్తుండగా, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై ఎస్. రాధాకృష్ణ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు టీజర్ తో కథపై ఇంట్రెస్ట్ పెంచిన ఆదర్శ కుటుంబం మూవీ టీమ్.. నారాయణమ్మ పాటతో మ్యూజికల్ జర్నీని మొదలుపెట్టింది.

ప్రసవానంతరం మహిళల శరీరాకృతిలో వచ్చే మార్పులపై సోషల్ మీడియాలో జరుగుతున్న విమర్శలు, బాడీ షేమింగ్‌పై నటి పరిణీతి చోప్రా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నేనొక కొత్త జీవికి జన్మనిచ్చాను.. అలాంటప్పుడు నా పూర్వపు శరీరాకృతిని వెంటనే తిరిగి పొందాలని ఎందుకు ఒత్తిడి తెస్తారు? అని ప్రశ్నించారు. ప్రసవం తర్వాత తల్లుల శరీరాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, బాడీ పోలీసింగ్ నిర్వహించడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రసవానంతరం మహిళలు వీలైనంత త్వరగా బరువు తగ్గి పాత రూపురేఖలను సంతరించుకోవాలని సమాజం ఆశించడాన్ని పరిణీతి తీవ్రంగా తప్పుపట్టారు. ప్రసవమై ఆరు నెలలు దాటింది. ఇంకా పాత రూపానికి ఎందుకు రాలేదు? అని ఓ మాతృమూర్తిని ప్రశ్నించడానికి మీరెవరు? అని నిలదీశారు. ఒక జీవిని సృష్టించే క్రమంలో మహిళల శరీరంలో మార్పులు రావడం నూటికి నూరుపాళ్లు సహజమని, ఆ మార్పులను అంగీకరించకుండా విమర్శించడం దారుణమని అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రసవానంతరం బాడీ షేమింగ్, ట్రోలింగ్‌కు గురైన కత్రీనా కైఫ్‌తో పాటు ప్రతి తల్లికి పరిణీతి మద్దతుగా నిలిచారు. ప్రసవానంతర శరీరంపై అసభ్యకరమైన ..విమర్శనాత్మక కామెంట్లు చేసేవారిని అజ్ఞానులుగా అభివర్ణించారు.





## 40ల్లో తల్లి బాధలు వర్ణనాతీతం

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్న ఓ ఫన్నీ అండ్ రిలేటబుల్ రీల్ నెటిజన్ల దృష్టిని విశేషంగా ఆకట్టుకుంటోంది. 40 ఏళ్ల వయసులో ఓవైపు అంతర్జాతీయ కెరీర్, మరోవైపు చిన్నారి కూతురు మాల్టీ మేరీ పెంపకం బాధ్యతలను బ్యాలెన్స్ చేస్తున్న వేళ తనలో చోటుచేసుకుంటున్న మామ్ బ్రెయిన్ మార్పులపై చేసిన పోస్ట్ ప్రతి తల్లికీ కనెక్ట్ అయ్యేలా ఉంది. ఈ వీడియోలో 40 ఏళ్ల వయసులో మాతృత్వంలోకి అడుగుపెట్టిన తర్వాత చిన్న చిన్న విషయాలను కూడా మరచిపోవడం ఎంత సహజమో సరదాగా చూపించారు. రోజువారీ పనులు చేస్తుండగా హఠాత్తుగా విషయాలు మర్చిపోవడం, వస్తువులు ఎక్కడ పెట్టామో గుర్తుకు రాకపోవడం వంటి మామ్ బ్రెయిన్ ఘట్టాలను పీసీ హాస్యాస్పదంగా ఆవిష్కరించారు. ఈ రీల్ ద్వారా చిన్న పిల్లల పెంపకంలో నిమగ్నమైన ప్రతీ తల్లి మానసిక పరిస్థితిని ఆమె ప్రతిబింబించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో నిమిషాల్లోనే వైరల్‌గా మారింది. ఇది కేవలం ప్రియాంక కథ మాత్రమే కాదు. మా అందరి కథ అని నెటిజన్లు.. ముఖ్యంగా తల్లులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

## మిస్టర్ బీస్ట్.. ‘జైశ్రీరాం’

యూట్యూబ్ లో కోట్లాది మంది ఫాలోవర్లను సంపాదించుకున్న ఆ గ్లోబల్ కంటెంట్ క్రియేటర్.. రామాయణ సినిమా ప్రమోషన్ ఈవెంట్ లో ఇండియన్ కల్చర్ ను ఎంతో ఇంట్రెస్ట్ గా ఫాలో అయ్యారు. యూట్యూబర్ మిస్టర్ బీస్ట్ అలియాస్ జేమ్స్ స్టీఫెన్ డొనాల్డ్ సన్ ప్రస్తుతం ఇండియాలో విజిట్ చేస్తున్నారు.




అయితే ముంబైలో జరిగిన రామాయణ మూవీ ప్రమోషనల్ ఈవెంట్ కు బీస్ట్ చీఫ్ గెస్ట్ గా అటెండ్ అయ్యారు. బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్, నేచురల్ బ్యూటీ సాయిపల్లవి, నటుడు రవి దూబే, దర్శకుడు నితేశ్ తివారి, నిర్మాత నమిత్ మల్హోత్ర తదితరులు ఆ ఈవెంట్ లో పాల్గొన్నారు. ఈవెంట్ లో మిస్టర్ బీస్ట్ కు మూవీ టీమ్ చాలా ట్రెడిషనల్ గా వెల్కమ్ చెప్పింది. ఆ సమయంలో రణబీర్ కపూర్ ఆయనకు ఇండియన్ ట్రెడిషన్స్ ప్రకారం నమస్కారం చేయడం ఎలాగో చూపించారు. రెండు చేతులు జోడించి ప్రేక్షకులకు విష్ చేయాలని చెప్పారు. మిస్టర్ బీస్ట్ కూడా అదే విధంగా చేతులు జోడించి అందరినీ పలకరించారు. అయితే ఆ కార్యక్రమంలో అసలు హైలైట్ మరో సీన్. మిస్టర్ బీస్ట్ ను జై శ్రీరామ్ అని నినదించమంటూ ఆడియన్స్ కోరారు. దీంతో రణబీర్ కపూర్ ఆయన చెవిలో ఆ విషయం చెప్పగా.. మిస్టర్ బీస్ట్ వెంటనే ‘జై శ్రీరామ్’ అంటూ నినదించారు. దీంతో అక్కడి ఎన్విరాన్మెంట్ ఒక్కసారిగా మారిపోయింది. ఆడియన్స్ పెద్ద ఎత్తున రెస్పాండ్ అవుతూ సందడి చేశారు.

## బ్రేకప్ చేసుకున్నా

హీరోయిన్ నివేదా పేతురాజ్ ప్రేమ, పెళ్లి వ్యవహారం అప్పట్లో టాలీవుడ్ లో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. పెళ్లి పనులు కూడా మొదలయ్యాయని చెప్పిన ఆమె.. ఇప్పుడు ఆ రిలేషన్ బ్రేకప్ వరకు వెళ్లిన విషయాన్ని బయటపెట్టారు. అంతేకాదు.. ఆ రిలేషన్ విషయంలో ముందే తనకు ఓ అనుమానం వచ్చిందని చెప్పడం ఇప్పుడు ఇంట్రెస్టింగ్ గా మారింది. మెంటల్ మది సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నివేదా పేతురాజ్.. ఆ తర్వాత వరుస సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. చిత్రలహరి, బ్రోచేవారెవరా, అల వైకుంఠపురములో, రెడ్, పాగల్, విరాటపర్వం, దాస్ కా ధమ్కీ వంటి సినిమాల్లో నటించారు. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండాలనుకున్నా.. ఇప్పుడు మళ్లీ సినిమాల్లో బిజీ కావాలని చూస్తున్నారు. ఇదిలా ఉంటే.. నివేదా వ్యక్తిగత జీవితం కూడా అప్పట్లో వార్తల్లో నిలిచింది. గత ఏడాది వినాయక చవితి సందర్భంగా తన లవర్ ను సోషల్ మీడియా ద్వారా పరిచయం చేశారు. దుబాయ్ కు చెందిన బిజినెస్ మ్యాన్ రజిత్ ఇబ్రాన్ తో తాను రిలేషన్ షిప్ లో ఉన్నట్లు వెల్లడించారు. రజిత్ తో తన పరిచయం ఐదేళ్ల క్రితం దుబాయ్ లో జరిగిన ఓ రేసింగ్ సందర్భంగా మొదలైందని నివేదా గతంలో చెప్పారు.



## కోహ్లీ.. 15000 పరుగులు



ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్‌లో 15,000 పరుగులు పూర్తి చేసిన రెండో భారత బ్యాటర్‌గా, ప్రపంచంలో రెండో ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. సచిన్ టెండూల్కర్ (18,426) మాత్రమే అతని కంటే ముందున్నాడు. అయితే, సచిన్ 377 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించగా, కోహ్లీ కేవలం 303 ఇన్నింగ్స్‌లలోనే ఈ మైలురాయిని అందుకొని అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టడం విశేషం. కోహ్లీ కేవలం 303 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించగా, సచిన్ ఈ మార్కును చేరుకోవడానికి 377 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. ఈ గణాంకాలు కోహ్లీ నిలకడకు, అసాధారణ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ రన్ మెషీన్ ఖాతాలో వన్డేల్లో మొత్తం 54 సెంచరీలు కూడా ఉన్నాయి. ఓవరాల్‌గా వన్డే క్రికెట్ లో అత్యధిక పరుగుల జాబితాలో కోహ్లీ రెండోస్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో సచిన్ 452 ఇన్నింగ్స్ లలో 18,426 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు.

# కోహ్లీ, గిల్ దంచుడే దంచుడు

### తొలి వన్డేలో టీమిండియా గ్రాండ్ విక్టరీ.. వెస్టిండీస్‌పై ఘన విజయం

### వన్డేల్లో 15,000 పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా కోహ్లీ

### వెస్టిండీస్ బ్యాటర్ జస్టిన్ గ్రీవ్స్ సెంచరీ వృథా



వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. పరుగుల వీరుడు విరాట్ కోహ్లీ (139 నాటౌట్), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (110) శతకాలతో చెలరేగడంతో 296 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 2 వికెట్లు కోల్పోయి 41.4 ఓవర్లలోనే ఛేదించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ అరుదైన మైలురాయిని అందుకోవడంతో పాటు, తన వన్డే కెరీర్‌లో 54వ శతకాన్ని నమోదు చేశాడు. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 295 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ (62) శుభారంభం అందించగా, మరో ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ (101) అద్భుత సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఆఖర్లో అమీర్ జంగూ (58 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో విండీస్‌కు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 40 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టగా, ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు తీశాడు. అనంతరం 296 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్‌కు రోహిత్ శర్మ (32) వేగవంతమైన ఆరంభం ఇచ్చాడు. అతను ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 151 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారు. గిల్ 108 బంతుల్లో 13



ఫోర్లు, 1 సిక్సర్‌తో 110 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత కోహ్లీ తన విశ్వరూపం ప్రదర్శించాడు. కేవలం 88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్సర్లతో 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే సెప్టెంబర్ 30న గౌహతిలో జరగనుంది.

## 2027 వన్డే ప్రపంచకప్ నాకు చివరిది: కోహ్లీ

భారత స్టార్ క్రికెటర్, పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ తన కెరీర్‌కు సంబంధించి ఒక కీలక ప్రకటన చేశాడు. 2027లో జరగబోయే వన్డే ప్రపంచకప్పే తనకు చివరిదని స్పష్టం చేశాడు. ఆ టోర్నీ ఫైనల్‌కు సంబంధించి తనకున్న ఒక పెద్ద కలను కూడా అభిమానులతో పంచుకున్నాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతూ కోహ్లీ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. "నాకు ఇదే చివరి ప్రపంచకప్. నా సర్వశక్తులు ఒడ్డి ఆడటానికి ఇదే నాకు అతిపెద్ద ప్రేరణ. ఎలాగైనా కప్ గెలవడమే మా లక్ష్యం. దాని కోసం ఏం చేయడానికైనా నేను సిద్ధంగా ఉన్నాను" అని కోహ్లీ చెప్పాడు. తన చిరకాల కలను వివరిస్తూ, "ఫైనల్లో ఛేజింగ్ చేస్తూ మ్యాచ్‌ను గెలిపించే ఇన్నింగ్స్ ఆడాలన్నది నా కల. అది జరిగితే అద్భుతం.

# ముగిసిన సింధు పోరాటం

### చైనా షట్లర్ చేతిలో ఓటమి

ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత పతక ఆశలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్‌లో పోరాడి ఓటమి పాలవ్వడంతో వ్యక్తిగత విభాగాల్లో భారత్ ప్రస్థానం ముగిసింది. చైనా క్రీడాకారిణి చెన్ యుఫీతో జరిగిన హోరాహోరీ పోరులో సింధు 21-11, 18-21, 10-21 తేడాతో పరాజయం చవిచూసింది. తొలి గేమ్ గెలిచి ఆశలు రేకెత్తించినా, ఆ తర్వాత ఆధిక్యాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ముఖ్యంగా చివరి గేమ్ లో ప్రత్యర్థి జోరు ముందు సింధు నిలవలేకపోయింది. ఈ ఓటమితో ఐచీ-నగోయా ఆసియా క్రీడలు 2026లో భారత బ్యాడ్మింటన్ ప్రస్థానం నిరాశజనకంగా ముగిసింది. ఈ క్రీడల్లో భారత్ కేవలం ఒక్క కాంస్య పతకంతోనే సరిపెట్టుకుంది. పురుషుల టీమ్ ఈవెంట్‌లో లభించిన ఈ కాంస్యమే ఈసారి ఏకైక పతకంగా మిగిలింది. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ సహా ఏ ఒక్క వ్యక్తిగత విభాగంలోనూ భారత షట్లర్లు పతకం సాధించలేకపోయారు. సింధుతో పాటు యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా కూడా క్వార్టర్స్‌లో ఓటమి పాలైంది. జపాన్‌కు చెందిన అకానే యమగూచితో జరిగిన మ్యాచ్‌లో ఉన్నతి ఓడింది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జోడీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట కూడా క్వార్టర్ ఫైనల్స్‌లోనే తమ పోరాటాన్ని ముగించాయి. ఈ టోర్నీలో భారత్‌కు అతిపెద్ద షాక్ డిఫెండింగ్ ఛాంపియన్లు సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి రూపంలో తగిలింది. పురుషుల డబుల్స్‌లో స్వర్ణ పతక ఫేవరెట్లుగా బరిలోకి దిగిన ఈ జోడీ, రౌండ్ ఆఫ్ 32లోనే థాయ్‌లాండ్ జంట చేతిలో అనూహ్యంగా ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లోనూ లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి వంటి ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరకముందే నిష్క్రమించారు. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల తర్వాత వ్యక్తిగత విభాగాల్లో భారత షట్లర్లు పతకం సాధించడంలో విఫలమవడం ఇదే తొలిసారి. గతంలో 2023 హాంగ్‌జౌలో మూడు పతకాలు సాధించిన భారత్, ఈసారి కేవలం ఒక్క కాంస్యంతోనే వెనుదిరగడం క్రీడాభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.









### రన్నింగ్, డెకథ్లాన్‌లో కాంస్యాలు

# లాంగ్ జంప్‌లో రజతం..

ఆసియా క్రీడలు 2026లో భారత్ ఎనిమిదో రోజు పతకాల వేట కొనసాగిస్తోంది. లాంగ్ జంప్‌లో యాన్సీ సోజన్‌కు రజతం దక్కింది. మహిళల 200 మీటర్ల రన్నింగ్ రేసులో హరిత భద్ర మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. పురుషుల హైజంప్‌లో భారత అథ్లెట్ సర్వేశ్ కుషారే రజత పతకం సాధించాడు. 2.25 మీటర్ల ఎత్తుకు జంప్ చేసి రెండో స్థానంలో నిలిచాడు. తైవాన్‌కు చెందిన చావో సువాన్ కూడా ఇదే ఎత్తుకు జంప్ చేశాడు. కానీ తొలి ప్రయత్నంలోనే అతడు జంప్ చేయడంతో స్వర్ణం దక్కింది. మరో వైపు మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ పారుల్ చౌదరీ కాంస్య పతకం సాధించింది.

ఆసియా క్రీడలు 2026లో భారత్ ఎనిమిదో రోజు పతకాల వేట కొనసాగిస్తోంది. లాంగ్ జంప్‌లో యాన్సీ సోజన్‌కు రజతం దక్కింది. ఐదో జంప్ వరకూ సోజన్ ఆధిపత్యం చెలాయిస్తూ వచ్చింది. కానీ ఆరో జంప్‌లో చైనా అథ్లెట్ హుయాంగ్ యింగ్యింగ్ 6.55 మీటర్లు దూకి స్వర్ణ పతకం సాధించింది. 6.53 మీటర్లు దూకిన సోజన్ సిల్వర్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక మూడో స్థానంలోనైనా నిలుస్తానని భావించిన షైలి సింగ్‌కు నిరాశే ఎదురైంది. 6.46 మీటర్లు దూకి నాలుగో స్థానంలో నిలవడంతో కాంస్యం చేజారింది. మహిళల 200 మీటర్ల రన్నింగ్ రేసులో భారత్ నుంచి ఇద్దరు ఫైనల్ వరకూ చేరుకున్న సంగతి తెలిసిందే. అందులో హరిత భద్ర మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. 200 మీటర్ల రేసును 23.20 సెకన్లలో పూర్తి చేసింది. కాగా మరో అథ్లెట్ ఉన్నతి అయ్యప్ప ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. సింగపూర్‌కు చెందిన పెరీరా శాంతి(22.78 సెకన్లు), చైనా అథ్లెట్(22.93 సెకన్లు) స్వర్ణ, రజత పతకాలను దక్కించుకున్నారు.

డెకథ్లాన్ పురుషుల ఈవెంట్‌లో భారత అథ్లెట్ తేజస్విన్ శంకర్‌కు కాంస్యం దక్కింది. 1500 మీటర్ల రేసులో అతడు మూడో స్థానంలో నిలిచాడు. జపాన్‌కు చెందిన మరుయమ యుమ 8,123 పాయింట్లతో స్వర్ణం గెలిచాడు. చైనా అథ్లెట్ 8,012 పాయింట్లతో రజతం సంపాదించగా.. తేజస్విన్ 7,934 పాయింట్లతో కాంస్యం అందుకున్నాడు.

## భారత్-ఆఫ్ఘన్ క్వార్టర్ ఫైనల్‌కు వాన గండం

ఆసియా క్రీడల క్రికెట్ ఈవెంట్‌లో సోమవారం జరగనున్న క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌పై వర్షం ముప్పు పొంచి ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, ద్వితీయ శ్రేణి ఆఫ్ఘనిస్థాన్ జట్టుతో తలపడనుండగా, ఈ మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే, మెరుగైన ర్యాంకు ఆధారంగా టీమిండియా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్ ఈ కీలక పోరుకు వేదిక కానుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:30) భారత్-ఆఫ్ఘన్ మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉంది. దీనికి ముందు ఉదయం 5:30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం 9 గంటలకు) పాకిస్థాన్, హాంకాంగ్ చైనా మధ్య తొలి క్వార్టర్ ఫైనల్ జరగనుంది. అయితే వాతావరణ సూచనల ప్రకారం, సోమవారం అక్కడ 97 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో రెండు మ్యాచ్‌ల నిర్వహణపై సందేహాలు నెలకొన్నాయి. ప్రైవేటు వాతావరణ సంస్థ 'ఆక్యువెదర్' నివేదిక ప్రకారం, పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభమయ్యే సమయానికి 70 శాతం, భారత్ మ్యాచ్ టాస్ సమయానికి 40 శాతం వర్షం పడే సూచనలు ఉన్నాయి. రోజంతా వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో మ్యాచ్‌లు సజావుగా సాగడం కష్టంగా మారింది. నిబంధనల ప్రకారం, నాకౌట్ మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయితే, ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ముందున్న జట్లను విజేతలుగా ప్రకటిస్తారు. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ వన్ స్థానంలో ఉండగా, ఆఫ్ఘనిస్థాన్ 10వ ర్యాంకులో ఉంది. అదేవిధంగా, పాకిస్థాన్ 6వ స్థానంలో, హాంకాంగ్ చైనా 24వ స్థానంలో కొనసాగుతున్నాయి.



నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# ప్రజలు ఎందుకు బలవ్వాలి?

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకోవడానికి సమ్మె ఒక ప్రజాస్వామ్య హక్కు. తమ వేతనాలు, పని పరిస్థితులు, సెలవులు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై యాజమాన్యాలతో చర్చించడం.. అవసరమైతే నిరసనకు దిగడం కార్మిక సంఘాలకు కొత్తేమీ కాదు. అయితే ఒక ప్రశ్న మాత్రం తప్పక తలెత్తుతుంది. ఉద్యోగుల సమస్యలకు ప్రజలు ఎందుకు బలవ్వాలి? సెప్టెంబరు 28 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా మూడు రోజుల బ్యాంకు సమ్మెకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపునిచ్చింది. ఐదు రోజుల పని వారాన్ని అమలు చేయడం ప్రధాన డిమాండ్లలో ఒకటి. పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకానికి సంబంధించిన అంశం కూడా వివాదంలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని కోరుతూ సమ్మెను వాయిదా వేయాలని ఉద్యోగ సంఘాలను కోరింది. ఇక్కడ అసలు సమస్య ఉద్యోగుల డిమాండ్లు సమంజసమా కాదా అన్నది మాత్రమే కాదు. ఆ డిమాండ్ల కోసం పోరాటం చేసే విధానం వల్ల సామాన్య పౌరుడికి కలిగే ఇబ్బందిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. బ్యాంకు అనేది కేవలం ఉద్యోగుల కార్యాలయం కాదు. కోట్లాది మంది ప్రజల ఆర్థిక జీవితానికి అది కీలకమైన వ్యవస్థ. రైతు పంట రుణం.. చిన్న వ్యాపారి రోజువారీ లావాదేవీలు.. వృద్ధుడి పెన్షన్.. విద్యార్థి ఫీజు.. వ్యాపార సంస్థల చెల్లింపులు.. ప్రభుత్వ లావాదేవీలు.. చెక్కుల నగదీకరణ.. నగదు జమ, ఉపసంహరణ.. ఇలా ఎన్నో కార్యకలాపాలు బ్యాంకులతో ముడిపడి ఉన్నాయి. సమ్మె ప్రభావం ప్రధానంగా ప్రత్యక్షంగా శాఖల్లో జరిగే సేవలపై పడే అవకాశం ఉంది.

నగదు జమ, ఉపసంహరణ, చెక్కుల పరిష్కారం, ఖాతా సంబంధిత పనులు ఆలస్యం కావచ్చు. డిజిటల్ బ్యాంకింగ్, నగదు యంత్రాలు, ఏకీకృత చెల్లింపు వ్యవస్థ వంటి సేవలు కొనసాగినా.. ప్రతి ఒక్కరికీ ప్రతి అవసరాన్ని డిజిటల్ మార్గంలో తీర్చుకునే అవకాశం ఉండదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం పరిమితంగా ఉన్నవారికి ఇబ్బందులు ఎక్కువ కావచ్చు. ఈసారి పరిస్థితి మరింత సున్నితమైనది. సెప్టెంబరు 27 ఆదివారం అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది తగ్గించేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు పనిచేశాయి. భారతీయ రిజర్వు బ్యాంకు కూడా శాఖలు, కార్యాలయాలు, నగదు యంత్రాలకు అనుబంధ శాఖలు, నగదు నిల్వ కేంద్రాలు పనిచేసేందుకు అనుమతించింది. అంటే ప్రభుత్వం కూడా వరుసగా వచ్చే సెలవులు, సమ్మె కారణంగా ప్రజలకు ఏర్పడే అంతరాయాన్ని గుర్తించింది. అంతేకాదు.. సెప్టెంబరు 30 బ్యాంకుల అర్ధవార్షిక ముగింపు రోజు. ఆ రోజున లెక్కల సరిచూడటం, నిధుల నిర్వహణ, ఆర్థిక కార్యకలాపాలు వంటి ముఖ్యమైన ప్రక్రియలు ఉంటాయి. ఈ సమయంలో సమ్మె జరగడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థపైనే కాకుండా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ లావాదేవీలు, ఇతర ఆర్థిక కార్యకలాపాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. అయితే ఇక్కడ మరో వైపు కూడా ఉంది. ఉద్యోగులు కోరుతున్న ఐదు రోజుల పని వారం కొత్తగా తెరపైకి వచ్చిన అంశం కాదు. 2024లో కుదిరిన వేతన ఒప్పందంలో దీనికి సంబంధించిన ప్రతిపాదన ముందుకు వచ్చింది. వారానికి ఐదు రోజులు పనిచేసే విధానంలో రోజువారీ పని సమయాన్ని సర్దుబాటు చేసి వినియోగదారులకు అందించే సేవలపై ప్రభావం తగ్గించవచ్చని ఉద్యోగ సంఘాలు వాదిస్తున్నాయి. అందువల్ల ఉద్యోగుల డిమాండ్లను ఒకే మాటతో తిరస్కరించడం సరైన పరిష్కారం కాదు. అదే సమయంలో ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రతి వివాదానికీ సమ్మెనే చివరి ఆయుధంగా ఎంచుకోవడం కూడా ప్రశ్నార్థకమే. ప్రజలకు అవసరమైన సేవలను అందించే రంగాల్లో నిరసనకు మరింత బాధ్యతాయుతమైన మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. ముందస్తు చర్చలు.. మధ్యవర్తిత్వం.. దశలవారీ నిరసనలు.. పరిమిత సమయ నిరసనలు.. అత్యవసర సేవలకు మినహాయింపులు.. ఇలాంటి ప్రత్యామ్నాయాలపై విస్తృతంగా ఆలోచించాలి. ఎందుకంటే ఉద్యోగి కూడా ఈ సమాజంలో భాగమే. బ్యాంకు ఉద్యోగి కుటుంబం ఒక రోజు బ్యాంకు మూసివేతతో ఇబ్బంది పడకపోవచ్చు. కానీ అదే సమయంలో ఒక చిన్న వ్యాపారి చెల్లింపు ఆగిపోవచ్చు. ఒక వృద్ధుడి అత్యవసర నగదు అవసరం నిలిచిపోవచ్చు. ఒక రోగి చికిత్సకు కావాల్సిన డబ్బు బదిలీ ఆలస్యం కావచ్చు. ఒక రైతు తన అవసరానికి రుణ మొత్తాన్ని పొందలేకపోవచ్చు. సమ్మె చేయాలా వద్దా అన్నది ఉద్యోగ సంఘాల నిర్ణయం కావచ్చు.

కానీ సమ్మె వల్ల కలిగే నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించడం మాత్రం ఉద్యోగ సంఘాలు, బ్యాంకు యాజమాన్యాలు, ప్రభుత్వం.. ముగ్గురి బాధ్యత. సమస్యను ఎవరు గెలిచారు అన్న దానికంటే.. ప్రజలు ఎంత తక్కువ ఇబ్బంది పడ్డారు అన్నదే ఒక ప్రజాసేవా వ్యవస్థ విజయానికి అసలైన కొలమానం కావాలి. బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లు చర్చల ద్వారా పరిష్కరించాలి. ప్రభుత్వం కూడా పెండింగ్ అంశాలపై స్పష్టమైన కాలపరిమితితో చర్చలు జరపాలి.

ఉద్యోగ సంఘాలు కూడా తమ నిరసనల ప్రభావాన్ని సామాన్యుడి కోణంలో చూడాలి. చివరికి బ్యాంకు తలుపులు ఉద్యోగుల కోసం మాత్రమే తెరుచుకోవు.. ప్రజల కోసం తెరుచుకుంటాయి. ఆ తలుపులు మూసుకున్నప్పుడు ఉద్యోగుల పోరాటం మాత్రమే కనిపించకూడదు.. వాటి బయట నిలబడే సామాన్యుడి అవసరమూ కనిపించాలి. ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం కావాలి.. కానీ ఆ పరిష్కారం కోసం ప్రజలు మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి రాకూడదు.

# అట్టడుగు వర్గాలకు ఆపన్నహస్తం..
# అశోక్ సింఘాల్



"పరోపకారార్థమిదం శరీరం".. మన ప్రాచీన వివేచనాత్మక నానుడి. ఈ ప్రకృతిలో వృక్షం తన పండ్లను తానే ఆరగించదు.. ఏ నదీ తన నీటిని తానే తాగదు. అలాగే సాధుజనులు కూడా ఈ ధరణిపై అదే స్ఫూర్తితో జీవిస్తారని ఈ నానుడి ప్రబోధిస్తుంది. ఆశ్రితులకు పండ్లతో ఆకలి తీర్చే వృక్షం.. తీరానికి చేరిన వారికి దప్పిక తీర్చే నది.. జన క్షేమమే పరమావధిగా జీవించే సాధుపుంగవులు.. ఈ కోవలోకి వస్తారు. వ్యక్తిగత విజయం కన్నా సాటి వారి సంక్షేమానికి అంకితమైన జీవితానికే నిజమైన పరమార్థం ఉంటుందని మన ఋషులు, మునులు అనాదిగా ప్రబోధిస్తూనే వచ్చారు. ఆ స్ఫూర్తిని తన జీవితంలో నిండుగా ప్రతిబింబించిన వ్యక్తుల్లో అశోక్ సింఘాల్ ఒకరు. ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యం, దశాబ్దాలపాటు కొనసాగిన అంకితభావం, సంస్థాగత కృషి మూర్తీభవించిన ఆయన అసమాన వ్యక్తిత్వాన్ని స్మరించుకుంటూ సెప్టెంబరు 27 నుంచి ఆయన శతజయంతి వేడుకలను నిర్వహించుకుందాం.



**నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

అశోక్ సింఘాల్‌తో సంభాషించి, ఆయన ఆదరాభిమానాలను పొందే అనేక అవకాశాలు లభించడం నిజంగా నా అదృష్టం. ఓ యువ కార్యకర్తగా సంస్థాగత బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో 1981లో జరిగిన ఓ సంఘటన నాకింకా గుర్తుంది. ఆ సమయంలో ఆయన స్వదస్తూరితో రాసిన లేఖ నాకు అందింది. సహజంగానే అది నాకు ఒక ప్రత్యేక అనుభూతిని కలిగించింది. త్వరలో చేపట్టబోయే ఓ కీలక కార్యక్రమాన్ని ఆ లేఖలో ప్రస్తావిస్తూ, అందుకు సంబంధించిన కర్తవ్యాన్ని ఆయన నాకు నిర్దేశించారు. ఆయన దశాబ్దాలపాటు రేయింబవళ్లు శ్రమించడాన్ని నేను స్వయంగా చూశాను. ఆ రోజుల్లో అశోక్ సింఘాల్ ఎంతో ప్రయాసకోర్చి సుదీర్ఘంగా ప్రయాణిస్తూ మారుమూల ప్రాంతాలకు వెళ్లేవారు. ప్రత్యేకించి గుజరాత్‌లోని గిరిజన ప్రాంతాల్లో పర్యటించేందుకు ఆయన ఆసక్తి చూపేవారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఇంకా ఏమి చేయగలమన్న ఆలోచనే ఆయన మదిలో సదా మెదిలేది. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ప్రకృతి వైపరీత్యం సంభవిస్తే.. బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు అందరికన్నా ముందుగా అక్కడికి చేరడం.. లేదా అప్పటికే అక్కడికి చేరుకున్న కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంలో అశోక్ సింఘాల్ ముందుండేవారు. గుజరాత్‌లోని కచ్‌లో 2001లో సంభవించిన భూకంపం తర్వాత ఆయనతో కలిసి పనిచేసిన నా అనుభవం చిరస్మరణీయం. సాటి మానవులపై కరుణ, వారి సంక్షేమంపై శ్రద్ధ చూపే విశిష్ట లక్షణాలను అశోక్ సింఘాల్ బాల్యంలోనే అలవరచుకున్నారు. ఆయన తండ్రి మహావీర్ పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత హోదాలో పనిచేసిన అధికారి. అలాంటి గొప్ప, సంపన్న కుటుంబంలో అశోక్ సింఘాల్ జన్మించారు. ఆయన సోదరుల్లో ఒకరైన బి.పి. సింఘాల్ పోలీసు అధికారిగా పనిచేసి, ఆ తర్వాత పార్లమెంటు సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. మరో సోదరుడు వి.పి. సింఘాల్ త్రిపుర రాష్ట్రం ఏర్పడిన సమయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ కుటుంబంలోని ఇతర సభ్యులు కూడా వాణిజ్య, వ్యవసాయ రంగాల్లో ఎన్నో విజయాలు సాధించారు. అయితే అశోక్ సింఘాల్ చిన్ననాటి నుంచే భిన్నమైన దృక్కోణం వైపు ఆకర్షితులయ్యారు. అదే.. మాతృభూమికి పునరుజ్జీవం.. భారతమాత బిడ్డల పూర్వవైభవ పునరుద్ధరణ. చిన్నతనంలోనే ప్రయాగ్‌రాజ్‌లోని నదీ సంగమం వద్ద ఆయన గంటల తరబడి దీర్ఘాలోచనలో మునిగిపోయేవారు. అలా నదిని చూస్తూ.. దానిపైనే కాకుండా అక్కడ పుణ్యస్నానాలు చేయడానికి వచ్చే సాధువులు, సన్యాసులు, భక్తులపైనా ఆసక్తి పెంచుకున్నారు. తద్వారా భారతీయ సాంస్కృతిక విలువలపై ఆయన అవగాహన ఇనుమడించింది. సమాజానికి తనవంతు సేవ చేయాలనే సంకల్పం మరింత బలపడింది.

"పరోపకారార్థమిదం శరీరం" అనే నానుడికి అనుగుణంగా ఆయన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వైపు ఆకర్షితులయ్యారు. తదనంతరం తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను ఉత్సాహంతో, క్రమశిక్షణతో, కర్తవ్య భావనతో నిర్వర్తించారు. పట్టుదల, అవిరళ కృషితో సంస్థలను, ఉద్యమాలను అశోక్ సింఘాల్ నడిపించారు. అద్భుతమైన కంఠస్వరం, యావత్ సభను మంత్రముగ్ధం చేయగల వాగ్ధాటి ఆయన సొంతం. మరోవైపు సాటి కార్యకర్తలతో సౌహార్ద సంబంధాలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం కూడా విశేషం. అశోక్ సింఘాల్‌తో పరిచయం ఏర్పడిన తర్వాత ఆయన ఎంత నిరాడంబరుడో తెలుసుకుని చాలామంది ఆశ్చర్యపోయేవారు. సాధుసంతులతోనూ ఆయనకు ప్రగాఢ అనుబంధం ఉండేది. అందుకే దేశంలోని సాధువులు, దార్శనికుల్లో ఆయనపై అపారమైన గౌరవం ఉండేది. వారంతా ఆయన సలహాలు, సూచనలకు ఎంతో విలువనిస్తూ శ్రద్ధగా ఆలకించేవారు. ఈ నేపథ్యంలో అశోక్ సింఘాల్ మహోన్నత వ్యక్తిత్వాన్ని చాటే రెండు సందర్భాలు ప్రత్యేకంగా స్ఫురణకొస్తాయి. మొదటిది.. షికాగోలో స్వామి వివేకానంద ప్రసంగ శతాబ్ది వేడుకల్లో భాగంగా 1993లో విశ్వ హిందూ పరిషత్ అమెరికాలో ఒక సదస్సును నిర్వహించింది. విదేశాల్లో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఆలోచన, అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించడం, విభిన్న భాగస్వాములను ఏకతాటిపైకి తీసుకురావడం.. ఇవన్నీ ఆయనలోని అనుపమాన నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనాలు. ఇక రెండోది.. ట్రినిడాడ్-టొబాగోలోని పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో 2000లో నిర్వహించిన ప్రపంచ హిందూ సదస్సు. ఆ కార్యక్రమానికి ఆయన రావడం ప్రతినిధులందరిలో ఎంతటి ఉత్సాహాన్ని రగిలించిందో నేను ప్రత్యక్షంగా చూశాను. అటుపైన నేను ప్రసంగించిన తర్వాత నన్ను అభినందిస్తూ ఆయన ప్రశంసాపూర్వకంగా పలికిన మాటలు నన్నెంతో కదిలించాయి. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో ప్రతి కార్యకర్త రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడాన్ని కూడా నేను ప్రత్యక్షంగా చూశాను. రామజన్మభూమి ఉద్యమంలో అశోక్ సింఘాల్ కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తుచేసుకోకుండా ఆయన ప్రస్తావన పూర్తి కాదు. 1991లో బోట్ క్లబ్‌లో జరిగిన సభలో ఆయన చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరి మదిలో నేటికీ నిలిచి ఉంది. ఈ ఉద్యమం ఉచ్ఛస్థాయికి చేరిన సమయంలో గాయం నుంచి రక్తం స్రవిస్తున్నా ఆయన దానిని లెక్కచేయకుండా ముందుకు సాగడాన్ని ఎవరైనా ఎలా మరువగలరు? నేడు అయోధ్యలో దివ్య-భవ్య రామ మందిరం రూపుదిద్దుకుందంటే.. నిస్వార్థంగా తమను తాము ఉద్యమ దీక్షకు అంకితం చేసుకున్న అశోక్ సింఘాల్ వంటి మహనీయుల కృషి అందులో కీలకమైనది. అయోధ్యలో రామ మందిర స్వప్నం సాకారం కావడాన్ని ఆయన చూడగలిగి ఉంటే ఎంత సంతోషించి ఉండేవారో ఊహించవచ్చు. అశోక్ సింఘాల్ ఆలోచనలు అత్యంత స్పష్టంగా ఉండేవి. సమాజంలో సామరస్యం నెలకొనాలని, సౌభ్రాతృత్వ భావనను బలపరిచే సందేశాన్ని పునరుద్ఘాటించాలని ఆయన ఎంతో గట్టిగా చెప్పేవారు. ఆయన విశ్వాసం ఈ స్పష్టమైన వ్యక్తిత్వంలోనే ప్రతిఫలించేది. సామాజిక ఐక్యత, సమానత్వ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారు. సమాజంలో ఎలాంటి వివక్షకు తావు ఉండకూడదని, ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, మర్యాద దక్కాలని ఆకాంక్షించేవారు.

అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి తొలి పునాది రాయిని బీహార్‌కు చెందిన అణగారిన వర్గాల క్షేత్రస్థాయి వీహెచ్‌పీ కార్యకర్త కామేశ్వర్ చౌపాల్ చేతుల మీదుగా వేయించాలన్నది ఆయన ఆలోచన. అలాగే కాశీలో జరిగిన ఓ 'ధర్మ పరిరక్షణ సభ'లో 'డోమ్ రాజా'ను సత్కరించాలని నిర్ణయించుకున్న ఆయన, ఆ తర్వాత వివిధ సామాజిక కార్యక్రమాల్లో ఆయనతో కలిసి పనిచేశారు. దేశ పురోగమనంతోపాటు మరో రెండు రంగాలపై అశోక్ సింఘాల్ ఎంతో ఆసక్తి చూపేవారు. వాటిలో ఒకటి విద్య.. ముఖ్యంగా వేద విద్య. రెండోది సంగీతం. ప్రాచీన కాశీ నగరం ఆయన జీవితంలో ఓ ప్రధాన పాత్ర పోషించిన నేపథ్యంలో, నేను వారణాసి ఎంపీగా దీనికి ప్రాతినిధ్యం వహించడం నాకెంతో గర్వకారణం. బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన సమయంలో ఉత్తమ విద్యార్థిగానూ అశోక్ సింఘాల్ గుర్తింపు పొందారు. మారుమూల గ్రామాలకు.. ముఖ్యంగా గిరిజన వర్గాలకు ప్రాథమిక విద్యను అందించే దిశగా కృషి చేసిన 'ఏకల్ విద్యాలయ' కార్యక్రమంతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉండేది. ఆయన విపరీతంగా పుస్తకాలు చదవడంతోపాటు ఇతరుల మాటలకు ఎంతో ప్రాధాన్యమిస్తూ శ్రద్ధగా వినేవారు. వీలైనంత ఎక్కువగా పుస్తకాలు చదవాల్సిందిగా యువ కార్యకర్తలను ఆయన సదా ప్రోత్సహించేవారు. అశోక్ సింఘాల్ అద్భుతమైన గాయకుడని ఆయనతో సాన్నిహిత్యం ఉన్నవారికి తెలుసు. నాగ్‌పూర్‌లో జరిగిన సమావేశాల సందర్భంగా ఆయన 'ఏకల్ గీత్' ఆలాపనతో అందరినీ అప్రతిభులను చేయడం నేను ప్రత్యక్షంగా చూశాను. తద్వారా ఆయన సమావేశాల్లో సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించేవారు. ముఖ్యంగా తన 90వ జన్మదినం సందర్భంగా 2015లో ఆయన అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ "హే మాతృభూమి మేరీ.. హే పితృభూమి మేరీ" అని పాడిన వీడియో ఎంతగా ప్రజల్లోకి వెళ్లిందో నాకిప్పటికీ గుర్తుంది. ఈ నేపథ్యంలో ఆయన శతజయంతి సందర్భంగా యువతరం మరింతగా ఆయన మహోన్నత వ్యక్తిత్వం గురించి తెలుసుకునేలా మనం కృషి చేద్దాం. అలాగే మన మాతృభూమి కోసం, ప్రజా సంక్షేమం కోసం ఆయన కన్న కలల సాకారం దిశగా మన ప్రతిజ్ఞను పునరుద్ఘాటిద్దాం. ప్రజా సేవను జీవిత ధ్యేయంగా మలుచుకుని, ఆధ్యాత్మికత, సాంస్కృతిక చైతన్యం, సంస్థాగత క్రమశిక్షణ, సామాజిక సేవలను తన కార్యాచరణలో మేళవించిన అశోక్ సింఘాల్ జీవితం.. ఒక వ్యక్తి తన జీవితాన్ని సమాజానికి ఎలా అంకితం చేయగలదో చెప్పే స్ఫూర్తిదాయక గాథగా నిలిచిపోతుంది.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.